# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 09 సంచిక :266 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: ఆదివారం 29-12-2024 | పేజీలు:4 వెల: 2.00


## ఆ రైతులపై సుప్రీంకోర్టు ఆగ్రహం..

న్యూఢిల్లీ, పంజాబ్‌లో రైతు సమస్యల పరిష్కారం కోసం డిమాండ్ చేస్తూ గత నెల 26 నుంచి నిరాహారదీక్ష చేస్తున్న రైతు నేత జగ్జీత్ సింగ్ దలేవాల్ ఆరోగ్య పరిస్థితి విషమంగా మారింది. దాంతో ఆయనను ఆస్పత్రికి తరలించకుండా ఇతర రైతు నాయకులు అడ్డుకుంటున్నారు. తమ డిమాండ్ల పరిష్కారంపై హామీ ఇచ్చిన తర్వాతనే దలేవాల్‌ను ఆస్పత్రికి తరలించేందుకు అంగీకరిసామని పట్టుబడుతున్నారు. ఆరోగ్యం క్షీణించిన నేపథ్యంలో రైతు నేత దలేవాల్‌ను వెంటనే ఆస్పత్రిలో చేరేందుకు ఒప్పించి, ఆస్పత్రికి తరలించాలని ఈ నెల 20న పంజాబ్ చీఫ్ సెక్రెటరీ, డీజీపీలను సుప్రీంకోర్టు ఆదేశించింది. అయితే ఈ ఆదేశాలను అమలు చేయడంలో వారు విఫలం కావడంతో వారికి వ్యతిరేకంగా కోర్టులో కంటెంప్ట్ పిటిషన్ దాఖలైంది. ఈ పిటిషన్‌పై న్యాయస్థానం ఇవాళ విచారణ చేపట్టింది. దలేవాల్‌ను ఆస్పత్రికి తరలించకుండా ఇతర రైతు నేతలు అడ్డుకుంటున్నారని ప్రభుత్వం తరఫు న్యాయవాదులు కోర్టుకు తెలిపారు. దాంతో కోర్టు ఆ రైతు నేతలపై ఆగ్రహం వ్యక్తం చేసింది. దలేవాల్ క్షేమం కోరేవారు ఆవిధంగా ప్రవర్తించరని వ్యాఖ్యానించింది. రైతు నేతలతో మాట్లాడి దలేవాల్‌ను వెంటనే ఆస్పత్రికి తరలించాలని ఆదేశించింది.

## కన్నీటితో మన్మోహన్ సింగ్ కు కడసారి వీడ్కోలు...





న్యూఢిల్లీ : ప్రఖ్యాత ఆర్థికవేత్త, మాజీ ప్రధానమంత్రి డాక్టర్ మన్మోహన్ సింగ్ పార్థివదేహానికి అంత్యక్రియలు పూర్తి అధికార లాంచనాలతో నిర్వహించారు.. దేశ రాజధానిలోని నిగమ్ బోధ్ ఘాట్ వద్ద నేడు జరిగిన అంత్యక్రియలలో మన్మోహన్ సింగ్ చితికి ఆయన పెద్ద కుమార్తె నిప్పు అంటించారు..కాగా, ఢిల్లీలోని ఏఐసీసీ ప్రధాన కార్యాలయం నుండి ప్రారంభమైన అంతిమయాత్ర నిగమ్?బోధ్ ఘాట్ వరకు 11 కిలో మీటర్ల మేర సాగింది. ఆర్థిక సంస్కరణల వాదికి తుది వీడ్కోలు పలికేందుకు పార్టీలకతీతంగా రాజకీయ నాయకులు, కాంగ్రెస్ శ్రేణులు పెద్ద ఎత్తున అంతిమయాత్రలో పాల్గొన్నారు. అంతిమయాత్ర సమయంలో మన్మోహన్ సింగ్ పార్థివదేహం ఉన్న సైనిక వాహనంలోనే రాహుల్ గాంధీ ఇతర కాంగ్రెస్ నేతలు కుర్చుకుని స్మశాన వాటికకు చేరుకున్నారు. మిలటరీ వాహనంపై నిగమ్ బోధ్ ఘాట్‌కు పార్థివదేహాన్ని అధికార, సైనిక లాంఛనాలతో తీసుకొచ్చారు. ఆ సమయంలో రోడ్డుకు ఇరువైపులా పెద్ద ఎత్తున జనం నిల్చున్నారు. పూలు చల్లుతూ కన్నీటి వీడ్కోలు పలికారు. నిగమ్ బోధ్ ఘాట్ వద్ద ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా, రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, అఖిల భారత కాంగ్రెస్ కమిటీ అధినేత మల్లికార్జున్ ఖర్గే, ఢిల్లీ ముఖ్యమంత్రి ఆతిషి, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కొందరు మంత్రులు నివాళి అర్పించారు. ఉప రాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌కర్, స్పీకర్ ఓం బిర్లా, కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా.. తదితరులు ఆయన పార్థివదేహానికి నివాళి అర్పించారు. చివరిగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము బాధాతప్త హృదయంతో నివాళి అర్పించారు. సెల్యూట్ చేశారు. ఆ సమయంలో అందరూ లేచి నిల్చుని మౌనం పాటించారు. భూటాన్ రాజు జిగ్మే ఖేసర్ నామ్‌గేల్ వాంగ్‌చుక్, మారిషస్ విదేశాంగ మంత్రి మనీష్ గోబిన్.. ఆయనకు నివాళి అర్పించిన వారిలో ఉన్నారు. ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా సహా పలువురు మంత్రులు, అధికారులు, వివిధ దేశాల ప్రతినిధులు అంత్యక్రియలకు హాజరైన వారిలో ఉన్నారు. చివరిగా మన్మోహన్ సింగ్? పార్థివదేహంపై జాతీయ జెండా ఉంచి భారత త్రివిధ దళాలు ఆర్థిక సంస్కరణలవాదికి ఘన నివాళులర్పించాయి. ఇక రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నివాళి అర్పించిన అనంతరం మన్మోహన్ సింగ్ పార్థివ దేహాన్ని చితిపైకి తీసుకొచ్చారు. సిక్కుల సంప్రదాయంలో అంత్యక్రియలను చేపట్టారు. ఆ సమయంలో సిక్ పెద్దలు సంప్రదాయబద్ధమైన కృపాణులను ధరించారు. కుటుంబ సభ్యులు, బంధువులు, సన్నిహితులు ప్రార్థనలను నిర్వహించారు .

## రాజీకి వచ్చేశారా? సీఎం రేవంత్, సినీ పెద్దల భేటీలో జరిగిందేమిటి?



హైదరాబాద్,సినిమా వాళ్లు, సర్కారోళ్ల మీటింగ్ అంటే.. ఓ వర్గానికి మాత్రమే ఇంట్రస్ట్. ఐతే ఇది అలాంటి ఇలాంటి మీటింగ్ కాదు. రాష్ట్రమంతా ఎదురుచూసింది. ఏం జరుగుతుందా అని ఆసక్తిగా గమనించింది. తెలంగాణ సీఎం రేవంత్‌తో.. ఇండస్ట్రీ పెద్దలు తొలిసారి భేటీ అయ్యారు. ఓవైపు సంధ్య థియేటర్ వివాదం.. మరోవైపు అల్లు అర్జున్ అరెస్ట్ రచ్చ.. ఇలాంటి పరిణామాల మధ్య సీఎంతో ఇండస్ట్రీ పెద్దలు ఏం చర్చించారు.. ఏఏ అంశాలు చర్చకు వచ్చాయ్. ఇండస్ట్రీకి, సర్కార్‌కు మధ్య రాజీ కుదిరిందా.. సీఎం రేవంత్ కోపం తగ్గిందా.. మీటింగ్ ఇన్‌సైడ్ టాక్ ఏంటి..

### సీఎం రేవంత్ ప్రకటనతో ఉలిక్కిపడ్డ టాలీవుడ్..

సంధ్య థియేటర్ ఘటన తర్వాత.. తెలంగాణ ప్రభుత్వానికి, టాలీవుడ్‌కు మధ్య గ్యాప్ ఏర్పడినట్లు క్లియర్‌గా అర్థమైంది. ఇక బన్నీ అరెస్ట్ ఎపిసోడ్‌తో.. మరింత అగాధంగా మారిందా అనే చర్చ జరిగింది. సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనను సీరియస్‌గా తీసుకున్న సీఎం రేవంత్.. సినిమా రంగ పెద్దలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బెనిఫిట్ షోలు, టికెట్ ధరల పెంపు ఇకపై ఉండవంటూ.. అసెంబ్లీ వేదికగా ప్రకటించారు. సంక్రాంతి సీజన్ వేళ.. సీఎం రేవంత్ ప్రకటనతో.. టాలీవుడ్ ఉలిక్కిపడింది.

### కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఫస్ట్ మీటింగ్..

సీఎం రేవంత్‌తో ఇండస్ట్రీ పెద్దలంతా భేటీ కావడం ప్రాధాన్యత సంతరించుకుంది. మీటింగ్ అనే మాట బయటకు వచ్చినప్పటి నుంచి.. ఆ సమావేశం ముగిసేవరకు.. సినిమా ఇండస్ట్రీ మాత్రమే కాదు.. పొలిటికల్ వర్గాల్లో ఆసక్తి కనిపించింది. నిజానికి రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత.. సీఎంతో ఇండస్ట్రీ పెద్దలు జరిపిన ఫస్ట్ మీటింగ్ ఇదే కావడం హైలైట్. పుష్ప మూవీ నిర్మాతలతో పాటు హీరోనే కారణం అంటూ.. ఇండస్ట్రీ పెద్దలకు చిన్నపాటి క్లాస్ కూడా తీసుకున్నారని టాక్. సినిమా హీరోలంతా సమాజానికి ఆదర్శంగా ఉండాలని.. రీల్ లైఫ్‌లోనే కాదు.. రియల్ లైఫ్‌లోనూ హీరోలుగా ఉండాలని హితోపదేశం చేసినట్లు తెలుస్తోంది.సమాజంపై సినిమా ప్రభావం ఎక్కువగా ఉంటుందని.. అది దృష్టిలో పెట్టుకుని సినిమాలు రూపొందించడంతో పాటు వ్యక్తిగతంగాను సినీ రంగానికి చెందిన వాళ్లు అందరికి ఆదర్శంగా ఉండేలా నడుచుకోవాలని చెప్పినట్లు తెలుస్తోంది. మహిళల భద్రత, డ్రగ్స్ కట్టడి ప్రచారంలో సినీ ప్రముఖులు పాల్గొనాలని సీఎం రేవంత్ సూచించినట్లు ఇన్‌సైడ్ టాక్.

### శాంతి భద్రతల విషయంలో రాజీపడే ప్రసక్తే లేదు..

ప్రభుత్వం ఇండస్ట్రీతోనే ఉందని.. శాంతి భద్రతల విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని సీఎం రేవంత్ క్లియర్‌కట్‌గా చెప్పారు. ఐటీ, ఫార్మాతో పాటు.. తమకు సినిమా రంగం ముఖ్యమే అన్న రేవంత్.. గద్దర్ అవార్డు ప్రస్తావన కూడా తీసుకువచ్చారు. సినీ పరిశ్రమ సమస్యల పరిష్కారం కోసం మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేశామని.. పరిశ్రమ కూడా కమిటీని ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఐతే బెనిఫిట్ షోలు, టికెట్ ధరల పెంపు విషయంలో.. అసెంబ్లీలో చేసిన ప్రకటనకు కట్టబడి ఉన్నామని.. మిగతా అంశాల్లో మాత్రం సినిమా ఇండస్ట్రీకి పూర్తి సహకారం ఉంటుందని సీఎం రేవంత్ స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. ఎప్పుడు కావాలన్నా.. ఇండస్ట్రీ వాళ్లు వచ్చి తనను కలవొచ్చని భరోసా ఇచ్చినట్లు తెలుస్తోంది. ఇండియా లెవల్‌లో తెలుగు సినిమాకి గౌరవం ఉందని.. తెలుగు సినిమాను ఇండియా లెవల్‌లో కాకుండా ప్రపంచస్థాయిలో చూడాలని సీఎం భావించారని.. FDC చైర్మన్ దిల్ రాజు చెప్పారు. త్వరలో సీఎంతో మరోసారి భేటీ అయ్యే అవకాశం ఉందని ఆయన చెప్పారు.ప్రభుత్వానికి, సినిమా ఇండస్ట్రీకి గ్యాప్ పెరిగినట్లు జరిగిన ప్రచారంలో ఏ మాత్రం నిజం లేదని.. దిల్ రాజు చెప్పారు. ఇదంతా ఎలా ఉన్నా.. సంధ్య థియేటర్ ఘటన.. అల్లు అర్జున్ అరెస్ట్ వ్యవహారం.. ఆ తర్వాత పరిణామాలతో.. సర్కార్ వర్సెస్ సినిమా అన్నట్లు యుద్ధం కనిపించింది. ఐతే ఇప్పుడు ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌తో జరిగిన భేటీలో.. చాలా విషయాలపై క్లారిటీ వచ్చిందని.. ఇంకొన్ని విషయంలో చాకచక్యంగా రాజీ కుదిరిందనే ప్రచారం జరుగుతోంది.

## వీడిన త్రీ సూసైడ్స్ మిస్టరీ.. అందుకే ఆ ముగ్గురు మృతి..



కామారెడ్డి:కామారెడ్డి జిల్లాలో కలకలం సృష్టించిన భిక్కనూరు ఎస్ఐ సాయికుమార్, బీబీ పేట కానిస్టేబుల్ శ్రుతి, కంప్యూటర్ ఆపరేటర్ నిఖిల్ మృతి ఘటన ఎట్టకేలకు మిస్టరీ వీడింది. అడ్లూర్ యల్లారెడ్డి చెరువులో మునిగి ముగ్గురు మృతి చెందినట్లు ప్రాథమిక పోస్టుమార్టం నివేదికలు వెల్లడిస్తున్నాయి. నీటిలో ఊపిరాడక మృతి చెందినట్లు వైద్యులు ప్రాథమికంగా నిర్ధారించినట్లు పోలీసులు తెలిపారు. ముగ్గురి మృతదేహాలపై ఎలాంటి గాయాలు లేవని నివేదికలు వెల్లడించినట్లు సమాచారం.మొదటగా ఆత్మహత్య చేసుకోవడానికి శృతి చెరువులో దూకింది. శృతి తర్వాత దూకిన నిఖిల్, ఈత రాకపోవడంతో నిఖిల్ గల్లంతు. శృతి కాపాడమని అడగడంతో ఎస్సై సాయి కుమార్ చెరువులోకి దూకాడు. చెరువు పెద్దది కావడం తో సాయి కుమార్ నీట మునిగారు. ముగ్గురికి ఈత రాకపోవడంతో ఊపిరి ఆడక ముగ్గురు మృతి. కానిస్టేబుల్ శృతిని కాపాడే ప్రయత్నంలో ఎస్సై సాయికుమార్, ఆపరేటర్ నిఖిల్ ఇద్దరు చెరువులోకి దూకినట్లు పోలీసులు గుర్తించారు. భిక్కనూరు పోలీస్ స్టేషన్ నుంచి అడ్లూర్ ఎల్లారెడ్డి చెరువు వరకు రహదారి పొడవునా ఉన్న సీసీ కెమెరాల ఫుటేజీలను సేకరించారు. 25వ తేదీ (బుధవారం) మధ్యాహ్నం 1.26 గంటలకు ముగ్గురి సెల్ ఫోన్లు స్విచ్ఛాఫ్ అయినట్లు నిర్ధారణ అయింది. ముగ్గురూ ఒకేసారి నీటిలో మునిగిపోయి ఉంటారని భావిస్తున్నారు.

## వైకుంఠ ఏకాదశికి విస్తృత ఏర్పాట్లు.. ఈవో శ్యామల రావు



తిరుమల : వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని 2025 జనవరి 10 నుండి 19వ తేదీ వరకు 10రోజుల పాటు భక్తులకు శ్రీవారి ఆలయంలో వైకుంఠ ద్వార దర్శనం కోసం విస్తృత ఏర్పాట్లు చేపడుతున్నామని ఈవో జె.శ్యామల రావు తెలిపారు. తిరుమల అన్నమయ్య భవనంలో శనివారం నిర్వహించిన డయల్ యువర్ ఈవో కార్యక్రమంలో ఈవో భక్తులను ఉద్దేశించి ప్రసంగించారు. ఆ వివరాలు ఇవి.వైకుంఠ ద్వార దర్శనం కొరకు భక్తులు క్యూలైన్లలో ఎక్కువ సమయం వేచి ఉండాల్సిన అవసరం లేకుండా భక్తులకు టైంస్లాట్ టోకెన్లు జారీ చేస్తాం.

### ఆన్‌లైన్ దర్శన టికెట్ల వివరాలు..

1.40 లక్షల రూ.300/- ప్రత్యేక ప్రవేశదర్శనం టికెట్లను డిసెంబరు 24న ఆన్‌లైన్‌లో విడుదల చేశాం.శ్రీవాణి దర్శన టికెట్లు జనవరి 10న 1500, మిగిలిన 9 రోజులకు 2000 టికెట్లు మరియు గదుల కోటాను డిసెంబరు 23న ఆన్‌లైన్‌లో విడుదల చేశాం.ఈ టికెట్లను పొందిన భక్తులకు మహాలఘు దర్శనం ఉంటుంది.

### దాతలకు దర్శనం, బస..

ఆన్‌లైన్‌లో దర్శనం బుక్ చేసుకున్న దాతలను రూ.300/- ప్రత్యేక ప్రవేశ దర్శన క్యూలైన్ ద్వారా దర్శనానికి అనుమతిస్తాము.సామాన్య భక్తుల సౌకర్యార్థం జనవరి 8 నుండి 11వ తేదీ వరకు దాతలకు గదుల కేటాయింపు ఉండదు. మిగతారోజుల్లో దాతలు యథావిధిగా గదులు బుక్ చేసుకోవచ్చు.

### ఆఫ్‌లైన్‌లో స్లాటెడ్ సర్వదర్శనం టోకెన్ల వివరాలు..

తిరుపతిలోని 8 కేంద్రాలలో 87 కౌంటర్లు, తిరుమలలో 4 కౌంటర్లు కలుపుకుని మొత్తం 91 కౌంటర్ల ద్వారా టోకెన్లు మంజూరు చేస్తాం.జనవరి 10, 11, 12 తేదీలకు సంబంధించి మొదటి మూడు రోజులకు జనవరి 9వ తేదీన ఉదయం 5 గం.ల నుండి 1.20 లక్షల టోకెన్లు జారీ చేస్తాం.తదుపరి రోజులకు (13 నుండి 19వ తేదీ వరకు) ఏ రోజుకారోజు ముందు రోజు భూదేవి కాంప్లెక్స్, శ్రీనివాసం, విష్ణు నివాసంలలో టోకెన్లు జారీ చేస్తాం.

### తిరుపతి, తిరుమలలో కౌంటర్లు..

భక్తుల సౌకర్యార్థం తిరుపతిలో ఇందిరా మైదానం, రామచంద్ర పుష్కరిణి, శ్రీనివాసం కాంప్లెక్స్, విష్ణునివాసం కాంప్లెక్స్, భూదేవి కాంప్లెక్స్, భైరాగిపట్టెడలోని రామానాయుడు ఉన్నత పాఠశాల, ఎంఆర్ పల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, జీవకోనలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, అదేవిధంగా తిరుమల స్థానికుల కోసం తిరుమల బాలాజీ నగర్ కమ్యూనిటీ హాల్‌లో టోకెన్ కౌంటర్లు ఏర్పాటు చేస్తాం.కౌంటర్లు ఏర్పాటు చేస్తున్న ప్రాంతాల్లో భక్తులకు ప్రత్యేకంగా క్యూలైన్లు, బారీకేడ్లు, తాగునీరు, మరుగుదొడ్లు తదితర సదుపాయాలు కల్పిస్తున్నాం.సర్వదర్శనం టోకెన్ల కలిగిన భక్తులు తమకు కేటాయించిన సమయానికి తిరుమలకు వచ్చి స్వామివారి దర్శించుకోవాలని విజ్ఞప్తి.గోవిందమాల భక్తులు కూడా దర్శన టోకెన్లు పొంది దర్శనానికి రావాల్సి ఉంటుంది.

### భక్తులకు విజ్ఞప్తి..

దర్శనటోకెన్లు గల భక్తులను మాత్రమే తిరుమల శ్రీవారి దర్శనానికి అుమతించడం జరుగుతుంది. భక్తులు ఈ విషయాన్ని గుర్తించాలని కోరడమైనది.చంటిపిల్లల తల్లిదండ్రులతో పాటు వృద్ధులు, దివ్యాంగులు, ఎన్ఆర్ఐ, రక్షణ సిబ్బంది తదితర ప్రత్యేక దర్శనాలను ఈ పది రోజులపాటు రద్దు చేయడమైనది.భక్తుల అధిక రద్దీ దృష్ట్యా ఈ 10 రోజులలో విఐపి బ్రేక్ దర్శనాలకు సిఫార్సు లేఖలు స్వీకరించబడవు, అయితే ప్రోటోకాల్ పరిధిలోని ప్రముఖులు స్వయంగా వస్తే వారికి మాత్రం శ్రీవారి దర్శనం కల్పించడం జరుగుతుంది.

### శ్రీవారి ఆలయం..

అదేవిధంగా జనవరి 7న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం జరుగుతుంది.జనవరి 10న వైకుంఠ ఏకాదశి నాడు ఉదయం 9 నుండి 11 గంటల వరకు శ్రీదేవి భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామివారు స్వర్ణరథంపై ఆలయ నాలుగుమాడ వీధులలో భక్తులకు దర్శనమిస్తారు.జనవరి 11న వైకుంఠ ద్వాదశి సందర్భంగా ఉదయం 5.30 నుండి 6.30 గంటల వరకు చక్రస్నానం నిర్వహిస్తాం.

### అధ్యయనోత్సవాలు..

తిరుమల శ్రీవారి ఆలయంలో డిసెంబరు 30వ తేదీ నుండి అధ్యయనోత్సవాలు ప్రారంభమవుతాయి.ధనుర్మాసంలో వైకుంఠ ఏకాదశికి 11 రోజులు ముందు నుండి శ్రీవారి సన్నిధిలో అధ్యయనోత్సవం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది.

## ఆయన వల్లే పౌర అణు ఒప్పందం సాధ్యమైంది..



వాషింగ్టన్, మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ (మన్‌మోహన్ సింగ్) మృతి పట్ల అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ (జో బైడెన్) సంతాపం వ్యక్తం చేశారు. ఆయన 'నిజమైన రాజనీతిజ్ఞుడు', 'గొప్ప ప్రజా సేవకుడు' అంటూ కొనియాడారు. 'మన్మోహన్ సింగ్ ఓ గొప్ప రాజనీతిజ్ఞుడు. అద్భుతమైన ప్రజా సేవకుడు. ఆయన వ్యూహాత్మక దృక్పథం లేకుంటే భారత్ – అమెరికా మధ్య అపూర్వమైన సహకారం సాధ్యమయ్యేదే కాదు. చారిత్రాత్మకమైన భారతదేశం–అమెరికా పౌర అణు ఒప్పందం నుంచి ఇండో – పసిఫిక్ స్థలాల కోసం క్వాడ్‌ను ప్రారంభించడం వరకూ ఆయన కృషి మరవలేనిది' అంటూ పేర్కొన్నారు. జో బైడెన్, జిల్ బైడెన్.. మన్మోహన్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ మేరకు వైట్‌హౌస్ ఓ ప్రకటన విడుదల చేసింది.2004 నుంచి 2014 వరకు భారత ప్రధానిగా సేవలందించిన మన్మోహన్ సింగ్ మొదటి పర్యాయంలో దేశంలో ఎన్నో సంస్కరణలను తీసుకొచ్చారు. పైకి మృదుస్వభావిలా కనిపించినా దేశం కోసం నిర్ణయాల్లో అత్యంత కఠినంగా వ్యవహరించారు. ప్రత్యేక రాష్ట్రంగా తెలంగాణ ఏర్పాటు, ఉపాధి హామీ పథకం ప్రారంభం వంటి ఎన్నో కీలక పరిణామాలు ఆయన ప్రధానిగా ఉన్నప్పుడే చోటుచేసుకున్నాయి. 2008లో చరిత్రాత్మకమైన భారతదేశం–అమెరికా పౌర అణు ఒప్పందంపై సంతకం చేశారు. భారతదేశం ప్రపంచంలో అణుకి ప్రవేశించడానికి, ఇంధన సంక్షోభాన్ని అధిగమించడానికి ఈ ఒప్పందం దోహదపడింది. యూపీఏ ప్రభుత్వానికి బయటి నుంచి మద్దతిచ్చిన లెఫ్ట్ పార్టీలు ఈ ఒప్పందాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. మద్దతు ఉపసంహరించుకున్నాయి. అయినా మన్మోహన్ సింగ్ ఎక్కడా వెనక్కి తగ్గలేదు. అవసరమైతే ప్రధాని పదవికి రాజీనామా చేయడానికి కూడా సిద్ధమయ్యారు.

## రేపో మాపో కొత్త అధ్యక్షుడి ప్రకటన.. రేసులో మరో ఇద్దరు..



హైదరాబాద్, సార్వత్రిక ఎన్నికలు కేవలం నాలుగేళ్లు మాత్రమే ఉన్నాయా? తెలంగాణలో ఇప్పటివరకు కొత్త బీజేపీ అధ్యక్షుడు ఎందుకు నియమించ లేదు? రేవంత్ సర్కార్‌ని ఎదుర్కోవాలంటే బలమైన వ్యక్తి కావాలని భావిస్తోందా? రేపో మాపో కొత్త అధ్యక్షుడిపై ప్రకటన రానుందా? మరో ఇద్దరు ఎంపీలు అధ్యక్ష ఈ రేసులో ఉన్నారా? రాజకీయ కోణంలో పరిశీలన చేస్తోందా? అవుననే అంటున్నాయి కమలం వర్గాలు.బీజేపీలో దేశవ్యాప్తంగా సంస్థాగత ఎన్నికల హడావుడి నడుస్తోంది. ప్రస్తుతం కమిటీల ఎన్నికలపై జోరుగా కసరత్తు సాగుతోంది. ఈసారి దక్షిణాదిపై గురిపెట్టిన బీజేపీ.. కచ్చితంగా తెలంగాణను టార్గెట్ చేసింది. ఎలాగ లేదన్నా డజనకుపైగా సీట్లు గెలుచుకోవాలని భావిస్తోంది. సరైన వ్యక్తి కోసం వేట మొదలుపెట్టింది.

ప్రస్తుతం కులాల కన్నా, రాజకీయ కోణంలో అభ్యర్థిని ఎంపిక చేయాలన్నది కమలనాథుల ఆలోచనగా కనిపిస్తోంది. తెలంగాణ బీజేపీ అధ్యక్షుడి రేసులో కొత్త కొత్త పేర్లు వెలుగులోకి వస్తున్నాయి. కొత్త సారథి ఎవరనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. పార్టీకి సంబంధించి ఏ ఇద్దరు నేతలు మాట్లాడుకున్నా.. కాబోయే అధ్యక్షులు ఎవరనేది దానిపై చర్చించుకుంటున్నారు. ఈ క్రమంలో పలువురు నేతలు రేసులోకి వస్తున్నారు.ఇప్పటివరకు మల్కాజ్‌గిరి ఎంపీ ఈటెల రాజేందర్, డీకె అరుణ పేర్లు వెలుగులోకి వచ్చాయి. లేటెస్ట్‌గా మరో ఇద్దరి పేర్లు బలంగా వినిపిస్తున్నాయి. వారిద్దరూ ఎంపీలేనని ఢిల్లీ వర్గాల సమాచారం. ఒకరు ఎంపీ రఘునందన్ రావు కాగా, మరొకరు ధర్మపురి అరవింద్ పేర్లు వెలుగులోకి వచ్చాయి.వీరిద్దరి పేర్లు ఢిల్లీ పెద్దల పరిశీలనలో ఉన్నట్లు పొలిటికల్ సర్కిల్స్‌లో జోరుగా ప్రచారం సాగుతోంది. కుర్చీ కోసం ఎవరి స్థాయిలో వారు లాబీయింగ్ చేస్తున్నారు. ఢిల్లీ పెద్దలకు నిత్యం టచ్‌లో ఉంటూ కావాల్సిన సమాచారం ఇచ్చే ప్రయత్నం చేస్తున్నారు. దీనిపై హైకమాండ్ అభిప్రాయ సేకరణ జరుపుతోంది. పార్టీ కోణంలో కాకుండా.. పొలిటికల్ యాంగిల్‌లో కొత్త అధ్యక్షుడ్ని ఎంపిక చేయాలన్నది ఢిల్లీ పెద్దల ఆలోచనగా తెలుస్తోంది.ఈ వ్యవహారం పార్టీలో కొందరు సీనియర్ నేతలకు మింగుడు పడడం లేదు. దూకుడుగా వెళ్లే నేత, ఎమ్మెల్యే కన్నా ఎంపీగా ఉన్న వ్యక్తికే ఎక్కువగా అవకాశముందని తెలుస్తోంది. తెలంగాణలో అధిక జనాభా ఉన్న కులాలేంటి? వారికి సంబంధించి పార్టీలో ఎవరైనా ఎంపీ, ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్నారా? లేదా అనేదానిపై ఆరా తీసినట్లు పార్టీ వర్గాల మాట.గతంలో బీఆర్ఎస్ పదేళ్ల రూలింగ్‌లో ప్రజల్లో నెగిటివ్ వచ్చిందని భావిస్తోంది. అందువల్లే కాంగ్రెస్ సర్కార్ అధికారంలోకి వచ్చింది. కానీ, ఇప్పుడున్న పరిస్థితుల్లో రేవంత్ సర్కార్‌పై ఎదురుదాడి చేయడం అంత ఈజీ కాదన్నది కమల నేతల భావన. మొత్తానికి అన్ని కోణాల్లో ఆలోచించి కొత్త అధ్యక్షుడ్ని ఎంపిక చేయనుంది. జనవరి ఫస్ట్ లేదా సెకండ్ వీక్‌లో బీజేపీ హైకమాండ్ నుంచి ప్రకటన రావచ్చని అంటున్నారు నేతలు.

## సంపాదకీయం

ఆదివారం 29-12-2024

# పివి దార్శనికతకు ప్రతిరూపం మన్మోహన్ సింగ్ !

పివి ప్రధాని కాకుండా ఉండివుంటే భారతదేశ గతి మరోలా ఉండేది. ఇప్పటిలా దేశం పరుగెత్తేది కాదేమో. ఆర్థిక సంస్కరణలతో దేశానికి పునాది వేసిన పివి...తన కార్యాచరణ కోసం నిపుణులైన వారిని ఆనాడు ఎంపిక చేసుకున్నారు. అలా ఎంపిక చేసుకున్న వారిలో అగ్రగణ్యులు మన్మోహన్ సింగ్. ఆర్థిక సంస్కరణ లకు బీజం వేయాలన్న లక్ష్యంతో పివి చాల లోతుగా ఆలోచించి నిర్ణయాలు తీసుకున్నారు. ఈ క్రమంలో ఆనాడు ప్రణబ్ ముఖర్జీ లాంటి వారిని కూడా కాదని ఆర్థిక శాఖను ఏరికోరి మన్మోహన్ సింగ్కు కట్టబెట్టారు. తన ప్రణాళిక మేరకు మన్మోహన్ మాత్రమే పనిచేయగల సమర్థుడని పివి నమ్మారు కాబట్టే ఆర్థిక సంస్కరణల రథం పరుగెత్తింది. ఆర్బిఐ గవర్నర్గా మాత్రమే..పెద్దగా ఎవ్వరికీ గుర్తింపులేని మన్మోహన్ ఆనాడు పివి కేబినేట్లో చేరడంతో ఆయన ప్రతిభ కూడా బయటపడింది. పివి ప్రధానిగా బాధ్యతలు చేపట్టే నాటికి దేశ ఆర్థిక వ్యవస్థ అస్తవ్యస్థంగా ఉంది. విదేశీ బ్యాంకుల్లో బంగారం కుదువబెట్టారు. నిరుద్యోగం తాండవిస్తోంది. ఇవన్నీ బాగా ఆకళింపుచేసుకున్న నేతగా పివి నరసిహారావు ముందుగా దేశ ఆర్థిక వ్యవస్థను చక్కదిద్దాలన్న సంకల్పంతో తన కార్యాచరణను ప్రారంభించారు. అలా పివి తనకు చేదోడువాదోడుగా, రాజకీయ మకిలి అంటని మన్మోహన్ను ఎంచుకోవడం ఓ పెద్ద మైలురాయిగా చెప్పుకోవాలి. అలా పివి మార్గనిర్దేశనంలో మన్మోహన్ ఆర్థికమంత్రిగా తనవంతు ప్రయత్నాలు మొదలు పెట్టారు. ఆ సంస్కరణలే నేటికీ మనకు అన్నం పెడుతున్నాయి. పివి తీసుకుని వచ్చిన సంస్కరణలను ఆనాడు అంతా వ్యతిరేకించి నా.. ఇవాళ మనమంతా విదేశాల వైపు మొగ్గుచూపుతున్నాం. విదేశీ చదువులకు వెళుతున్నా, విదేశీ వస్తువులను కొనగలుగుతున్నా..అందుకు ఆనాటి సంస్కరణలే బీజం వేశాయి. అలా తొలిసారి మన్మోహన్ సింగ్ ఆర్థికమంత్రిగా 1991లో బడ్జెట్ ప్రవేశ పెట్టారు. ఆధునిక భారత్ వైపు అడుగులు వేయించిన 1991 బడ్జెట్పై మన్మోహన్ సింగ్కు సొంత పార్టీ నుంచి కూడా తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. ముఖ్యంగా ఎరువులు, పెట్రోల్, ఎల్పీజీ ధరలను పెంచడం చాలామంది ఎంపీలకు మింగుడు పడలేదు. కానీ, మన్మోహన్ మాత్రం ఆ వ్యతిరేకతను చాలా సున్నితంగా స్వీకరించారు. ఇదంతా ఆనాటి ప్రధానిగా పివి అంతరంగం నుంచి వచ్చిన నిర్ణయం. అందుకే నాటి ప్రధాని పీవీ నరసింహారావు కూడా సభ్యులను ఒప్పించే భారం మన్మోహన్ పై వేసి మౌనంగా ఉండిపోయారు. ఈనేపథ్యంలో మన్మోహన్ తోటి సభ్యులను ఒప్పించి.. మెప్పించి ముందడుగు వేశారు. ప్రధానిగా పీవీ నరసింహారావు బాధ్యతలు చేపట్టగానే.. ఆర్థికమంత్రిగా మన్మోహన్ సింగ్ను ఎంపిక చేశారు. ఈ నిర్ణయం అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. ఎట్టకేలకు ఆయన 1991 జులై 24న గతంలో ఎప్పుడూ చూడని, భారత్ తలెత్తుకుని ముందుకు సాగేలా బడ్జెట్ను ప్రవేశ పెట్టారు. తన బడ్జెట్లోని వివిధ అంశాలను మన్మోహన్ ఆనాడు మీడియాకు స్పష్టంగా వివరించారు. దానిని 'బడ్జెట్ విత్ హ్యూమన్ ఫేస్'గా అభివర్ణించారు. తీవ్ర విమర్శల మధ్య కూడా ఎరువులు, పెట్రోల్, ఎల్పీజీ ధరల పెంపును సమర్థించారు. మరోవైపు సొంత పార్టీ నేతల్లో వచ్చిన అసంతృప్తిని నాటి ప్రధాని నరసింహారావు గమనించి.. ఆగస్టు1న కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ మీటింగ్ ఏర్పాటుచేశారు. ఎంపీలు తమ ఆగ్రహం, అసంతృప్తిని బహిరంగంగా వెళ్లగక్కేందుకు అవకాశం ఇచ్చారు. వాటిని మన్మోహన్ నేరుగా ఎదుర్కొని సమాధానం చెప్పేలా నరసింహారావు మౌనంగా ఉన్నారు. ఈ సమావేశం 2, 3 తేదీల్లో ఇది సుదీర్ఘంగా కొనసాగింది. వాటిల్లో కూడా ప్రధాని పాల్గొన్నారు. ఈసందర్భంగా మన్మోహన్కు కేవలం మణిశంకర్ అయ్యర్, నాథూరామ్ మిర్దా నుంచి మాత్రమే మద్దతు లభించింది. ఇది రాజీవ్గాంధీ ఆకాంక్షలకు తగినట్లు ఉందని నాడు అయ్యర్ వర్ణించారు. సభ్యులను శాంతపర్చేందుకు నాడు మన్మోహన్ ఎరువుల ధరల్లో స్వల్ప తగ్గింపును చేశారు. ఎల్పీజీ, పెట్రోల్ ధరల్లో మాత్రం రాజీ పడలేదు. మొత్తం మీద అన్ని పక్షాలను శాంతపరుస్తూనే.. ఎరువుల ధరలపై నియంత్రణ తొలగింపును కొనసాగించ గలిగారు. వాస్తవానికి బడ్జెట్ ప్రవేశపెట్టాల్సిన జులై నాటికి భారత విదేశీ మారకద్రవ్యం పూర్తిగా అడుగం టింది. దీంతో ఆ నెల ఆర్బీఐ తన వద్ద ఉన్న 41 టన్నుల బంగారాన్ని బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్ వద్ద కుదవపెట్టి విదేశీ మారక ద్రవ్యాన్ని తెచ్చుకొంది. ఇది కూడా కొన్నాళ్లు మాత్రమే దేశ అవసరాలు తీర్చగలదు. దీంతో పీవీ-మన్మోహన్ జోడీ వ్యతిరేకతను ఎదురీది దేశాన్ని సంక్షోభ సుడిగుండం నుంచి ఒడ్డుకు చేర్చింది. అలా ఒక్కో సంస్కరణతో ఆర్థికంగా భారత్ను బలోపేతం చేయడంతో పాటు..దేశాన్ని ప్రపంచ దేశాల సరసన నిలబెట్టే అతిపెద్ద కార్యక్రమం సాగింది. ఇవాళ మారుమూల గ్రామాలకు చెందిన వారు కూడా ఉన్నత చదువులకు విమానా లెక్కి వెళుతున్నారంటే అందుకు ఆనాటి ప్రధాని పివి దార్శనికత కారణం. ఆయన ఇచ్చున వెసలుబాటుతో మన్మోమన్ సింగ్ ఆర్థికరంగాన్ని బలోపేతం చేసేలా కార్యక్రమాల కు శ్రీకారం చుట్టారు. యూపీఏ హయాంలో 2004 నుంచి 2014 వరకు మన్మోహన్ సింగ్ దేశ ప్రధానిగా బాధ్యతలు నిర్వర్తించారు. ఆ సమయంలో విపక్షాలు ఆయన్ను 'మౌన ప్రధానమంత్రి' అంటూ విమర్శలు చేశాయి. ప్రధానంగా నేటి ప్రధాని మోడీ ఈ విషయంలో ఓ అడుగు ముందుకు వేసి మౌనముని అంటూ విమర్శించారు. ఆర్థిక దివాళ అంటూ విమర్శలు చేశారు. అయితే మన్మోహన్ పదేళ్ల కాలం నాటి ఆర్థిక వ్యవస్థకు, నేడు మోడీ అనుసరిస్తున్న ఆర్థిక వ్యవస్థ తీరును పరిశీలిస్తే మనమంతా ఎక్కడ ఉన్నామో గమనించవచ్చు. ధరల పెరుగుదల, జివిస్టీ పేరుతో పన్నుల భారం వంటివన్నీ చూస్తున్నాం. కానీ మన్మోహన్ కాలంలో జిడిపికి నేటి జిడిపికి తేడా గమనించవచ్చు. ద్రవ్యోల్బణం, ధరల పెరుగుదల, పెట్రో ధరల సవారీ, నిరుద్యోగం, డాలర్ మారకం రేటు అన్నీ గమనిస్తే..మన్మోహన్ ఆర్థిక విధానాలు ఎంత బాగున్నాయో అర్థం చేసుకోవచ్చు. కానీ వీటిని అర్థం చేసుకోని వారు ఇద్దరు మాత్రమే ఉన్నారు. వారిలో ఒకరు ప్రధాని మోడీ, రెండోవారు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మాత్రమే. కాంగ్రెస్లో ఉన్నా మన్మోహన్ ఏనాడూ ఆర్థిక విధానాల నుంచి పక్కకు తొంగిచూడలేదనడానికి ఇదే నిదర్శనం. పివి- మన్మోహన్ నిర్ణయాలను పరికిస్తే నేటి మోడీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు దిగదుడుపే.

# బెళగావి దోవ చూపుతుందా?



న్యూఢిల్లీ,ఎన్నికలొచ్చినప్పుడల్లా భంగపాటు రివాజైన కాంగ్రెస్కు ఈసారి ఢిల్లీ ఎన్నికలకు రెండు నెలల ముందే అవమానం ఎదురైంది. 'ఇండియా' కూటమి నుంచి ఆ పార్టీని తక్షణం సాగనంపాలని ఆప్ పిలుపునివ్వటం వర్తమాన రాజకీయాల్లో కాంగ్రెస్ దయనీయస్థితిని వెల్లడిస్తోంది. వాస్తవానికి పార్టీ అధ్యక్ష హెూదాలో గాంధీ మహాత్ముడు బెల్గాం (ప్రస్తుతం బెళగావి) కాంగ్రెస్ సమావేశాలకు అధ్యక్షత వహించి వందేళ్లు పూర్తవుతున్న సందర్భంగా గురువారంనాడు రెండురోజుల శత వార్షిక వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా సీడబ్ల్యూసీ విస్తృత స్థాయి సమావేశాలు జరుగు తున్నాయి. సైద్ధాంతిక వైరుద్ధ్యాలతో పరస్పరం కలహించుకునే పక్షాలు ఒక దరి చేరి కూటమిగా చెప్పుకున్నంత మాత్రాన అవి కలిసి కాపురం చేస్తాయన్న నమ్మకం ఎవరికీ ఉండదు. అందువల్లేఇండియా కూటమికి ప్రారంభంలోనే పగుళ్లొచ్చాయి. కూటమిలో ఉంటాను గానీ బెంగాల్ వరకూ ఎవరికీ ఒక్కటంటే ఒక్క సీటివ్వనని తొలుతే తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జి తెగేసి చెప్పారు. అనంతరకాలంలో ఆమె దూరం జరిగారు. ఢిల్లీ వరకూ ఆప్ సైతం ఇంచుమించు అదే వైఖరి తీసుకుంది. పార్లమెంటు ఎన్నికల్లో పొత్తుకు అంగీకరించినా ఈ ఫిబ్రవరిలో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో ఒంటరి పోరుకు వెళ్తామన్నది. ఆప్, కాంగ్రెస్ పార్టీలు రెండూ అభ్యర్థుల ఎంపికలో తలమునకలయ్యాయి. ఈలోగా ఆప్పై రాజకీయంగా పైచేయి సాధించటం కోసం కాంగ్రెస్ విరుచుకుపడుతోంది. తాము గెలిస్తే మహిళా సమ్మాన్ పేరుతో ఇప్పటికే ఇస్తున్న రూ. 1,000ని రూ. 2,100కు పెంచుతామని ఆప్ వాగ్దానం చేయడాన్ని కాంగ్రెస్ ప్రధానంగా తప్పుబడుతోంది. ఆప్ ఇస్తున్న సంక్షేమ హామీలు ప్రజలను మోసగించడమేనని, ఇది శిక్షార్హమైన నేరమని ఆ పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్పై, ముఖ్యమంత్రి అతిశిపై కాంగ్రెస్ కేసులు పెట్టింది. ఆయన్ను జాతి వ్యతిరేకిగా అభివర్ణించింది. ఆప్ వైఫల్యాలపై శ్వేతపత్రం కూడా విడుదల చేసింది. ఇటీవల జరిగిన హరియాణా అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్, ఆప్ విడివిడిగా పోటీ చేసినా ఇంతగా వైషమ్యాలు లేవు. బెళగావి సమావేశాల్లో కాంగ్రెస్ కార్యాచరణ ప్రణాళిక ఖరారు చేయాలని పార్టీ భావిస్తోంది. అయితే దేనిపైనా తనకంటూ స్పష్టమైన వైఖరి లేకుండా గాలివాటుకు కొట్టుకుపోయే విధానాలను అవలంబించినంత కాలమూ ఇలాంటి కార్యాచరణలు ఎంతవరకూ సత్ఫలితాలిస్తాయన్నది సందే హమే. ఆర్నెల్లక్రితం జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో పొత్తుపెట్టుకున్న ఆప్పై ఇప్పుడు జరగబోయే అసెంబ్లీ ఎన్నికల కోసం హఠాత్తుగా స్వరం మార్చి విమర్శలు లంకించుకోవటం వెనకున్న అంత రార్థాన్ని జనం గ్రహించలేరని కాంగ్రెస్ భావిస్తున్నదా అన్న సందేహం వస్తుంది. ఢిల్లీని వరసగా మూడు దఫాలు పాలించిన కాంగ్రెస్ పార్టీ అక్కడ తనకెదురవుతున్న చేదు అనుభవాలకు కారణ మేమిటో లోతైన అధ్యయనం చేస్తే ఎంతో కొంత ఫలితం ఉంటుంది. దానికి బదులు బీజేపీ మాదిరే ఆప్పై విమర్శలు చేస్తే చాలన్నట్టు కాంగ్రెస్ పోకడ ఉంది. మూడు దశాబ్దాల క్రితం ఢిల్లీ కాంగ్రెస్ హెచ్కేఎల్ భగత్, జగదీష్ టైట్లర్ గ్రూపులుగా విడిపోయి అంతర్గత కలహాలతో సతమతమవుతున్న తరుణంలో దాదాపు బయటి వ్యక్తిగా ముద్రపడిన షీలా దీక్షిత్కు ఢిల్లీ పీసీసీ చీఫ్ పదవి అప్పగించారు. ఆ తర్వాతే అక్కడ కాంగ్రెస్ గట్టెక్కింది. ఇప్పుడు ఆ మాదిరి వ్యూహం ఉన్నట్టు కనబడదు. ఈసారి మౌలికస్థాయిలో పార్టీ పునర్నిర్మాణానికి నడుం బిగించామని, ఢిల్లీలో తమకు మంచిస్పందన ఉన్నదని కాంగ్రెస్ నేతలు చెప్పుకుంటున్నారు. అదే నిజమైతే బస్తీలు ఎదుర్కొంటున్న సమస్యలపై, ముఖ్యంగా కాలుష్యంపై ఆ పార్టీ దృష్టి సారించాలి. పార్టీ అంతర్గత నిర్మాణం చక్క దిద్దుకోవాలి. కానీ జరుగుతున్నది వేరు. గత లోక్సభ ఎన్నికల్లో కాంగ్రెస్ ఈ పొరపాటే చేసింది. ఆ ఎన్నికల్లో ఆప్%-%కాంగ్రెస్ పొత్తు మెరుగైన ఫలితాలనిస్తుందని అందరూ భావించారు. కానీ అప్పటి పీసీసీ అధ్యక్షుడు అరవింద్ సింగ్ లవ్లీతోసహా కీలక నేతలు పార్టీ విజయావకాశాలను దెబ్బ తీశారన్నది విశ్లేషకుల అంచనా. అరవింద్ సింగ్ ఇప్పుడు బీజేపీలో చేరారు. పేరుకు ఇండియా కూటమికి నేతృత్వం వహిస్తున్నా భాగస్వామ్య పక్షాల నుంచి కాంగ్రెస్కు సూటిపోటి మాటలు తప్పడం లేదు. ఇప్పటికే సమాజ్వాదీ పార్టీ, ఆర్జేడీ, ఎన్సీపీ, నేషనల్ కాన్ఫరెన్స్ తదితర పక్షాలు కాంగ్రెస్ సామర్థ్యంపై సందేహం వ్యక్తం చేస్తున్నాయి. వీరితో ఆప్ సైతం గొంతు కలపటం కాంగ్రెస్ దయనీయ స్థితిని తెలియజేస్తున్నాయి. కార్యాచరణ మాట అటుంచి ముందు మిత్రులతో కలిసి ప్రయాణించలేని పరిస్థితులు ఎందుకేర్పడ్డాయో ఆత్మవిమర్శ చేసుకో వాల్సిన అవసరం కనబడుతోంది. ఒక విపక్షంగా ఎటూ సమస్యలు వచ్చిపడుతుంటాయి. కానీ తెచ్చిపెట్టుకుంటున్న సమస్యలు కోకొల్లలని ఆ పార్టీ గ్రహించలేకపోతున్నది. ఎంతసేపూ పార్టీ వైఫల్యాలకు స్థానికంగా ఉండే నేతలను వేలెత్తి చూపటం మినహా తమ వ్యవహార శైలి ఎలాఉంటున్నదన్న స్పృహ అగ్ర నాయకత్వానికి కరువైంది. స్థానికంగా పార్టీని బలోపేతం చేస్తున్న వారిని అనుమానదృక్కులతో చూడటం, చురుగ్గా పనిచేస్తున్నవారికి వ్యతిరేకంగా ముఠాలను ప్రోత్సహించటం, విశ్వాసపాత్రులనుకున్న నాయకులకే అంతా కట్టబెట్టడం ఇంకా తగ్గలేదు. హరియాణాలో ఓటమికి ఇలాంటి పోకడలు కూడా కారణం. ఇప్పుడు ఢిల్లీ పార్టీలో ఉన్న అంతర్గత లోటుపాట్లను సవరించి బలోపేతం చేయటంపై దృష్టి సారించక ఆప్పై ఆరోపణతో కాలక్షేపం చేయటం కాంగ్రెస్ బలహీనతను సూచిస్తుంది. బెళగావిలోనైనా ఆ పార్టీకి జ్ఞానోదయమవుతుందా?

# ఆప్ పథకాలపై బిజెపి కన్నెర్ర...



న్యూఢిల్లీ,వచ్చే ఏడాది మొదట్లోనే ఢిల్లీ శాసనసభకు ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ఆమ్ఆద్మీ పార్టీ, బిజెపి వడివడిగా పావులు కదుపుతున్నాయి. అయితే పట్టణ మధ్యతరగతి అవసరాలను గుర్తించి వారిని సంతృప్తి పర్చడంలో కేజ్రీవాల్ ఎప్పుడూ ముందుంటారు. ఇది ఢిల్లీ మోడల్ పరిపాలన అని చాటుతుంటారు. ఇదే బాణీతో రెండేళ్ల క్రితం పంజాబ్లో ఆమ్ఆద్మీ పార్టీ (ఆప్) అఖండ విజయం సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగలిగింది. ఇప్పుడు ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఓటర్లను అమితంగా ఆకర్షించే రెండు పథకాలను తయారు చేశారు.ముఖ్యమంత్రి మహిళా సమ్మాన్ యోజన పథకం ఒకటి, వృద్ధులకు ఉచితంగా ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో వైద్యచికిత్స అందించే సంజీవన్ యోజన పథకం మరొకటి. ఇది బిజెపికి కంటగింపుగా మారుతోంది. మరి ఎవరు వెనుక నుండి నాటకం ఆడిస్తున్నారో బయటపడడం లేదు కానీ బుధవారం ఒక వార్తాపత్రికలో ఢిల్లీ అధికారులే ఈ పథకాల గురించి తమ వద్ద ఎలాంటి సమాచారం లేదని, వాటిని అధికారికంగా విశ్వసించలేమని వ్యాఖ్యానిస్తూ ఒక ప్రకటన వెలువడింది. దీనికి ఢిల్లీ ముఖ్యమంత్రి అతిశీ ఆ ప్రకటన తప్పుడు ప్రకటన అని సంబంధిత అధికారులపై చర్య తీసుకుంటామని హెచ్చరించారు. దీనిని బట్టి ఆప్ పార్టీని దెబ్బ తీయడానికి కేంద్రం లోని కొన్నిశక్తులు పని చేస్తున్నాయని తెలుస్తోంది. కేంద్రానికి తాబేదారుగా ఢిల్లీ గవర్నర్ పనిచేస్తున్న ఉదంతాలు ఎన్నో ఉన్నాయి. ఆయన ఒత్తిడితోనే అధికారులు తప్పుడు ప్రకటనలు ఇచ్చారన్న అపోహలు వస్తున్నాయి.ఏదేమైనా ప్రజాకర్షక పథకాల అమలులో కేజ్రీవాల్ నేతృత్వంలోని ఆమ్ఆద్మీ ప్రభుత్వానికి మంచి గుర్తింపు ఉంది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి మహిళా సమ్మాన్యోజన పథకం కింద మహిళలకు నెలనెలా రూ. 2100 వరకు ఆర్థిక సహాయం అందిస్తామని, అలాగే వృద్ధులకు ఉచితంగా ఆరోగ్యభద్రత కల్పిస్తామని ప్రచారం చేస్తూ ఆమ్ఆద్మీ పార్టీ నేత కేజ్రీవాల్, ముఖ్యమంత్రి అతిశీ లబ్ధిదారుల పేర్ల జాబితా తయారు చేయడం బుధవారం ప్రారంభించారు. బుధవారం మధ్యాహ్నం ఈస్ట్ కిద్వాయి నగర్లో ఈ పథకాల లబ్ధిదారుల రిజిస్ట్రేషన్లు చేపట్టారు. అయితే ఈ విధంగా పేర్లు రిజిస్ట్రేషన్ చేస్తుండటం కేవలం కంటితుడుపే తప్ప మరేంకాదని బిజెపి ఎద్దేవా చేస్తోంది.గౌరవభృతి మంజూరు చేసే ఫారాలను నింపుతున్నది అధికారులు కాదని, ఆప్ నాయకులని బిజెపి విమర్శిస్తోంది. అయితే ఓటర్ల జాబితాలో పేర్లు ఉంటేనే వెంటనే వారి పేర్లను రిజిస్టర్ చేసి పథకాల ప్రయోజనాలు పొందేలా పసుపు రంగు కార్డులు మహిళలకు అందిస్తున్నామని కేజ్రీవాల్ చెప్పారు. బుధవారం నుంచి మహిళా సమ్మాన్ యోజన, సంజీవని యోజన పథకాలకు సంబంధించి ఢిల్లీ మొత్తం మీద రిజిస్ట్రేషన్ ప్రారంభించినట్టు తెలిపారు. ఈ విధంగా తన నియోజకవర్గం (న్యూఢిల్లీ) నుంచి ఈ డ్రైవ్ మొదలు పెట్టామన్నారు. మహిళలు తమకోసం ప్రత్యేకించిన పసుపు రంగు రిజిస్ట్రేషన్ కార్డు భద్రంగా దాచుకోవాలన్నారు. ఢిల్లీ ప్రభుత్వానికి, కేంద్ర ప్రభుత్వానికి మధ్య సాగుతున్న ఆధిపత్య పోరు సంక్షేమ పథకాల అమలుపై ప్రభావం చూపిస్తుందా? అన్నప్రశ్నకు పథకాలకు నిధుల విషయంలో ఎలాంటి ఆందోళన అక్కరలేదన్నారు. ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలవుతున్నట్టే ఈ రెండు పథకాలు అమలవుతాయని కేజ్రీవాల్ స్పష్టం చేశారు. మహిళలకు తప్పకుండా ప్రతినెలా రూ. 2100 అందుతుందని భరోసా ఇచ్చారు.దీనికి బడ్జెట్ ఎక్కడ నుంచి వస్తుంది అని ఆందోళన అక్కరలేదని, అది నా బాధ్యతని కేజ్రీవాల్ పేర్కొన్నారు. ఈ రెండు పథకాలు ప్రారంభించడం విప్లవాత్మకమైన చర్యగా ఆప్ చెబుతోంది.అయితే బిజెపి మాత్రం ఈ పథకాల అమలుపై అనేక ప్రశ్నలు వేస్తోంది ఎలాంటి నోటిఫికేషన్ లేదా బడ్జెట్ కేటాయింపు లేకుండా ఏ విధంగా ఈ పథకాలను అమలు చేస్తారని ఢిల్లీ బిజెపి చీఫ్ సచ్దేవ ప్రశ్నిస్తున్నారు. పంజాబ్లోని ఆప్ ప్రభుత్వం 2022 నుంచి ఎలాంటి పథకాలను అమలు చేయలేనప్పుడు ఇక్కడి ఆప్ ప్రభుత్వం ఏ విధంగా అమలు చేయగలుగుతుందని విమర్శిస్తున్నారు.సంజీవని యోజన పథకం పేరుతో వృద్ధ జనాభాను కేజ్రీవాల్ మోసగిస్తున్నారని ఢిల్లీ బిజెపి అధికార ప్రతినిధి ప్రవీణ్ శంకర్ కపూర్ ధ్వజమెత్తారు. ప్రైవేట్ ఆస్పత్రుల్లో వృద్ధులకు వైద్య చికిత్స అన్నముసుగులో ప్రైవేట్ ఆస్పత్రులకు కిక్బాక్ స్కీమ్ను అమలు చేయాలని చూస్తున్నారని విమర్శించారు. ఇదిలా ఉండగా కేజ్రీవాల్ పోటీ చేస్తున్న న్యూఢిల్లీ అసెంబ్లీ నియోజకవర్గంలో బుధవారం ఢిల్లీ బిజెపి నేత పర్వేష్ వర్మ మహిళా ఓటర్లకు రూ. 1100 చొప్పున పంచుతూ రెడ్హ్యాండెడ్గా దొరికినట్టు ఆమ్ఆద్మీ పార్టీ ఆరోపించింది. పర్వేష్ వర్మను తమ సిఎం అభ్యర్థిగా ప్రకటించనున్నట్టు కొందరు తనతో చెప్పారని, అలాంటి వ్యక్తిని సిఎంగా ఢిల్లీ ప్రజలు అంగీకరిస్తారా అని కేజ్రీవాల్ ప్రశించారు.ఈ ఆరోపణలను పర్వేష్ వర్మ తోసిపుచ్చారు. తన తండ్రి దివంగత సాహిబ్ సింగ్ వర్మ (ఢిల్లీ మాజీ సిఎం) ఏర్పాటు చేసిన ఎన్జిఒ రాష్ట్రీయ స్వాభిమాన్ తరఫున డబ్బులు అందజేసినట్టు వివరణ ఇచ్చుకున్నారు. కేజ్రీవాల్ 11 ఏళ్లపాలనలో మహిళల ఆవేదనను తాను చూశానని, అందుకే నెలవారీ మహిళలకు రూ. 1100 వంతున ఇవ్వాలని తాను నిర్ణయించుకున్నట్టు చెప్పారు. కేజ్రీవాల్ తరహాలో తాను మద్యం పంపిణీ చేయలేదు కదా అని విమర్శించారు. అయితే ఎన్నికలను దృష్టిలో ఉంచుకునే ఇప్పటినుంచి ఓటర్లకు బిజెపి నగదు పంపిణీ చేయడం ప్రారంభించిందని ఆప్ వర్గాల నుంచి విమర్శలు వస్తున్నాయి.

## ముంబై ఉగ్రదాడి కుట్రదారు.. హాఫీజ్ అబ్దుల్ రహ్మాన్ మక్కీ మృతి

లాహోర్,ముంబై ఉగ్రదాడి కుట్రదారు, లష్కరే తోయిబా (ఎల్ఈటీ) డిప్యూటీ చీఫ్ హాఫీజ్ అబ్దుల్ రహ్మాన్ మక్కీ శుక్రవారం పాకిస్థాన్లో గుండెపోటుతో మరణించారు. గత కొద్ది రోజులుగా లాహోర్లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో మధుమేహ వ్యాధితో బాధపడుతూ చికిత్స పొందుతూ.. శుక్రవారం తెల్లవారు జామున ఆయన తుది శ్వాస విడిచారని జమాత్-ఉద్-దవా అధికారి ధృవీకరించారు. కాగా, 2019 మేలో మక్కీని పాకిస్తాన్ ప్రభుత్వం అరెస్టు చేసింది. 2020లో పాకిస్తానీ ఉగ్రవాద నిరోధక కోర్టు టెర్రర్ ఫైనాన్సింగ్ కేసుల్లో అతనిని దోషిగా నిర్ధారించడంతో అతనికి ఆరు నెలల జైలు శిక్ష విధించింది.అలాగే, 26/11 ముంబై టెర్రర్ దాడులకు ఆర్థిక సహాయం అందించడంలో హాఫీజ్ అబ్దుల్ రహ్మాన్ మక్కీ కీలక పాత్ర పోషించారు. దీంతో 2023లో మక్కీని ప్రపంచ ఉగ్రవాదిగా ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి ప్రకటించింది. దీంతో అతడి ఆస్తులను జప్తు చేయడంతో పాటు ఆయన ప్రయాణాలపై ఆంక్షలు విధించింది. జూడి కార్యకలాపాల ముసుగులో మిలిటెంట్ కార్యకలాపాలకు నిధుల సమీకరణ చేయడంలో కీలక పాత్ర పోషిస్తున్నారనే ఆరోపణలు రావడంతోనే ఈ చర్యలు తీసుకుంది.

# ఆంధ్రప్రదేశ్లో దేవాలయాలకు మంచిరోజులు

గుంటూరు, ఆంధ్రప్రదేశ్లో దేవాలయాలకు మంచి రోజులు వచ్చాయని టీటీడీ బోర్డు మెంబర్ భాను ప్రకాశ్ రెడ్డి చెప్పారు. గత వైసీపీ ప్రభుత్వంలో గుడిని గుడిలో లింగాన్ని సైతం మింగేశారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అందుకు తిరుమల స్వామివారి దేవస్థానంలో పరకామణి చోరీ సంఘటన నిదర్శనమని భాను ప్రకాశ్ ఆరోపించారు. భక్తులు సమర్పించే కానుకలను పరకామణి నుంచి దొంగిలించిన వ్యక్తితో లోక్ అదాలత్లో రాజీ చేసుకున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలో కొందరు పెద్దలు టీటీడీకి చెందిన వందల కోట్ల రూపాయలతో జేబులు నింపుకున్నారని భాను ప్రకాశ్ ధ్వజమెత్తారు. తిరుమలలో దోపిడీపై విచారణ కోసం ఏపీ డీజీపీని కలవబోతున్నట్లు ఆయన చెప్పుకొచ్చారు. గత వైసీపీ ప్రభుత్వం దేవాలయాల వ్యవస్థని పూర్తిగా నిర్వీర్యం చేసిందని మండిపడ్డారు. ముఖ్యమంత్రిగా జగన్ మోహన్ రెడ్డి బాధ్యతలు చేపట్టిన తర్వాత దేవాలయాలు, విగ్రహాలపై దాడులు పెరిగాయని ఆయన మండిపడ్డారు. పలు ఆలయాలకు చెందిన రథాలను సైతం కాల్చివేసిన ఘటనలు వెలుగు చూశాయని భాను ప్రకాశ్ ధ్వజమెత్తారు. తిరుమల దేవస్థానం ఆధ్వర్యంలో హిందూ ధర్మ పరిరక్షణ కోసం ఉద్యమిస్తామని ఆయన చెప్పారు. వైసీపీ ప్రభుత్వంలో టీటీడీ నిధులను దారి మళ్లించే ప్రయత్నం చేశారని టీటీడీ బోర్డు మెంబర్ భాను ప్రకాశ్ సంచలన ఆరోపణలు చేశారు. ఏపీలో ఏ దేవాలయం నుంచి కూడా ఒక్క రూపాయి నిధులను ప్రభుత్వ కార్యక్రమాలకు ఉపయోగించకూడదని ఆయన డిమాండ్ చేశారు. మన హిందూ ఆలయాలను మనమే కాపాడుకోవాలని భాను పిలుపునిచ్చారు. దీనికి సంబంధించి విజయవాడలో జనవరి 5న జరిగే శంఖారావం కార్యక్రమంలో హిందూ ధర్మ పరిరక్షణకు తీర్మానం చేయనున్నట్లు భాను ప్రకాశ్ వెల్లడించారు.

# నాటి పాపాలు నేటికీ వెంటాడుతూనే ఉన్నాయ్

ప్రకాశం, నాడు ముఖ్యమంత్రిగా జగన్ చేసిన పాపాలు నేటికీ రాష్ట్ర ప్రజలను వెంటాడుతూనే ఉన్నాయని మంత్రి బాల వీరాంజనేయ స్వామి విమర్శలు గుప్పించారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ... ప్రజలపై నాడు విద్యుత్ భారాలు మోపి నేడు ఏమీ ఎరుగనట్టు ధర్నాలకు పిలుపునివ్వడం సిగ్గుచేటని మండిపడ్డారు. తాను పెంచిన చార్జీలపై తన పార్టీ శ్రేణులతోనే ధర్నాలు చేయించడం సైకో చర్య. ఏపీఈఆర్సీ అనుమతించిన దాని కన్నా రూ.19 వేల కోట్లు అదనంగా విద్యుత్ కొనుగోళ్లకు ఖర్చు చేయడం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. యూనిట్ రూ.5 లకే వచ్చే విద్యుత్ను కమీషన్ల కోసం బహిరంగ మార్కెట్లో రూ.8 నుంచి రూ.14 కు కొనుగోలు చేసింది జగన్ కాదా అని నిలదీశారు. జగన్ తన అవినీతిని ప్రజలపై సర్దుబాటు ఛార్జీల రూపంలో భారం మోపేందుకు నాడే ఏపీఈఆర్సీ అనుమతి కోరింది వాస్తవం కాదా అని అడిగారు. జగన్ అవినీతి, ధన దాహం వల్లే ప్రజలపై విద్యుత్ భారం పడిందన్నారు. ఇవ్వన్నీ తెలిసి కూడా దొంగే దొంగ అన్నట్టు జగన్ తీరు ఉందంటూ విమర్శలు గుప్పించారు. పవర్ చార్జీలు పెంచినందుకే జగన్కు ప్రజలు పవర్ పీకేశారన్న విషయం జగన్ తెలుసుకోవాల్నారు.. జగన్ ఇకనైనా ప్రజలను మోసం చేయడం మానుకొని వాస్తవాలు గ్రహించాలని మంత్రి బాల వీరాంజనేయ స్వామి హితవుపలికారు.

జగన్ది తుగ్లక్ చర్యే: మంత్రి గొట్టిపాటి

కూటమి ప్రభుత్వంపై వైసీపీ నాయకులు అసత్య ఆరోపణలు చేస్తున్నారని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ మండిపడ్డారు. విద్యుత్ చార్జీల పెంపు ప్రతిపాదన జగన్ రెడ్డి హయాంలోనే జరిగిందని తెలిపారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడే చార్జీలను పెంచాలని డిస్కంలు ఈఆర్సీని కోరాయన్నారు. 10 సార్లు విద్యుత్ చార్జీలు పెంచిన వైసీపీకి ధర్నా చేసే నైతిక హక్కు లేదని అన్నారు. జగన్ విద్యుత్ చార్జీలు పెంచాలని ప్రతిపాదించి.. నేడు వాటిపై ధర్నాలు చేయడం తుగ్లక్ చర్య అంటూ మంత్రి గొట్టిపాటి రవికుమార్ విమర్శలు గుప్పించారు.

వైసీపీ నిరసనలు...

కాగా.. కరెంట్ చార్జీల పెంపునకు నిరసగా ఈరోజు రాష్ట్ర వ్యాప్తంగా వైసీపీ పోరుబాటకు దిగింది. విశాఖపట్నంలోని గురుద్వార్ జంక్షన్ నుంచి ఏపీఈపీడీసీఎల్ కార్యాలయం వరకు వైసీపీ నేతల పాదయాత్ర చేపట్టారు. మాజీమంత్రి గుడివాడ అమర్నాథ్, వైసీపీ నేతలు ఈ పాదయాత్రలో పాల్గొన్నారు. అలాగే ఉమ్మడి కడప జిల్లాలో వైసీపీ నిరసన ర్యాలీలు చేపట్టింది. పులివెందుల్లో ఎంపీ అవినాష్ రెడ్డి ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. విద్యుత్ చార్జీల పెంపుకు నిరసనగా వైసీపీ నేతలు ర్యాలీలు నిర్వహించారు.

# వారికే ఛాన్స్...

హైదరాబాద్,తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ కార్యవర్గంపై కసరత్తు మొదలైందా? పీసీసీ కార్యవర్గంపై పార్టీ పెద్దలు ఫోకస్ పెడుతున్నారా? రాష్ట్రవ్యాప్తంగా పలువురు కాంగ్రెస్ సీనియర్ నేతలు, యూత్ లీడర్లు పార్టీ పదవులపై ఆశలు పెట్టుకుని ఎదురు చూస్తూన్నారు. పీసీసీ చీఫ్గా మహేష్ గౌడ్ బాధ్యతలు చేపట్టగానే కార్యవర్గంలో చోటు కోసం ఆశావహులంతా ప్రయత్నాలు ప్రారంభించారు. త్వరలోనే వారి ఎదురుచూపులకి ఎండ్ కార్డు పడే పరిస్థితి కనిపిస్తుంది. రాష్ట్ర కాంగ్రెస్ పెద్దలు పీసీసీ కార్యవర్గం ఏర్పాటు దిశగా స్పీడ్ పెంచారంటున్నారు.తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ కార్యవర్గంపై రాష్ట్ర పార్టీ పెద్దలు కసరత్తు షురూ చేశారు. ఎప్పుడెప్పుడా అంటూ ఎదురుచూస్తున్న ఆశావహులకు కమిటీ, పార్టీ పదవులతో గుడ్ న్యూస్ త్వరలో చెప్పాలని రాష్ట్ర అధినాయకత్వం డిసైడ్ అయ్యిందంట. కొత్త పీసీసీ మహేష్ గౌడ్ బాధ్యతలు చేపట్టి 100 రోజులు పూర్తి అయినా ఇంకా కార్యవర్గం పై క్లారిటీ రాక పోవడంతో పదవులు ఆశిస్తున్న పార్టీ నేతల్లో ఒకింత అసంతృప్తి వ్యక్తం అవుతుంది. ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం రాక, నామినేటెడ్ పదవులు దక్కక పార్టీ పదవులపై ఆశలు పెట్టుకున్న నాయకుల ఎదురుచూపులు తర్వలోనే ఫలిస్తాయంటున్నారు.ఏడాది పాలన పూర్తి చేసుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం నామినేటెట్, పార్టీ పదవుల భర్తీలో జాప్యం చేస్తుండటంపై కాంగ్రెస్ శ్రేణులు నారాజ్గా కనిపిస్తున్నాయి. విడతల వారీగా నామినేటెడ్ పదవుల భర్తీ జరుగుతున్నా.. ఇంత వరకు పాక్షికంగా వాటిని కేటాయించారన్న చర్చ జరుగుతోంది. వాటితో పాటు పార్టీ పరమైన పదవుల భర్తీ సంపూర్ణంగా చేయాలని నాయకులు డిమాండ్ చేస్తున్నారు. దానికి సంబంధించి పార్టీ పెద్దలు రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్చార్జ్ దీపాదాస్ మున్షి, సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్, సీనియర్ మంత్రులు కసరత్తు మొదలు చేశారంట. పలుమార్లు సమావేశమైన ముఖ్యనేతలు.. పీసీసీ కార్యవర్గం కూర్పుని దాదాపు ఫైనల్ చేసినట్లు తెలుస్తుంది. పార్టీ పెద్దల నిర్ణయాన్ని ఢిల్లీ అధినాయకత్వం ముందు ఉంచడమే లేటు.. కార్యవర్గంపై క్లారిటీ వస్తుందని పార్టీలో టాక్ వినిపిస్తుంది.వారం రోజుల్లో రాష్ట్ర పెద్దలు ఫైనల్ చేసిన పీసీసీ కార్యవర్గం లిస్టును ఢిల్లీ పెద్దల ముందు పెడతారని అంటున్నారు.

# వైకుంఠ ద్వార దర్శనాలకు మాత్రమే అనుమతి

తిరుమల, జనవరి 10 నుంచి 19వ తేదీ వరకు వైకుంఠ ద్వార దర్శనాలకు వచ్చే భక్తులకు టీటీడీ కీలక సూచనలు చేసింది. పది రోజుల వైకుంఠ ద్వార దర్శనాలకు టోకెన్లు, టికెట్లు ఉన్న భక్తులను మాత్రమే అనుమతి ఉంటుందని వెల్లడించింది. భక్తులకు కేటాయించిన దర్శన తేదీ రోజున మాత్రమే భక్తులు తిరుమల దర్శనానికి రావాలని టీటీడీ అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరి కోరారు. ఈ మేరకు అధికారులతో నిర్వహించిన సమీక్షలో పలు సూచనలు చేశారు.వైకుంఠ ద్వార దర్శనాలకు తిరుమలలో చేస్తున్న ఏర్పాట్లపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. వైకుంఠ ద్వార దర్శన టోకెన్లు జారీ చేయనున్న 9 కేంద్రాల్లో భక్తులకు అసౌకర్యం కలగకుండా టీ, పాలు, కాఫీ పంపిణీ చేయాలని ఆదేశించారు. ప్రోటోకాల్ ప్రముఖులకు మినహా పది రోజుల పాటు వీఐపీ బ్రేక్ దర్శనాలు రద్దు, చంటి బిడ్డలు, వృద్ధులు, దివ్యాంగులు, రక్షణ, ఎన్ఆర్ఐ, మొదలైన విశేష దర్శనాలు పది రోజుల పాటు రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. గోవింద మాల భక్తులకు ఎలాంటి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు ఉండవని, వైకుంఠ ద్వార దర్శన రోజుల్లో గదుల అడ్వాన్స్ రిజర్వేషన్ రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. భక్తులకు ఇబ్బంది తలెత్తకుండా లడ్డూ విక్రయ కేంద్రంలో ప్రతి రోజూ 3.50 లక్షల లడ్డూలను అందుబాటులో ఉంచాలని అన్నారు. చలి తీవ్రతకు భక్తులు ఇబ్బంది పడకుండా విశ్రాంతి గృహాల్లో వేడి నీరు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మూడు వేల మంది యువ శ్రీవారి సేవకులు, స్కౌట్ అండ్ గైడ్స్ సేవలను క్యూలైన్ల నిర్వహణకు వినియోగించుకోవాలన్నారు.

# విగ్రహాలకు వినతి పత్రాలు...

హైదరాబాద్, పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని రేవంత్ రెడ్డి సర్కార్‌ను డిమాండ్ చేస్తూ మాజీ సర్పంచ్‌లంతా మహాత్మా గాంధీ విగ్రహాలకు వినతిపత్రాలు అందజేశారు. రాష్ట్ర వ్యాప్తంగా మాజీ సర్పంచ్‌లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. హైదరాబాద్ లంగర్‌హౌస్‌లోని బాపు ఘాట్ వద్ద మహాత్మా గాంధీ విగ్రహానికి తెలంగాణ సర్పంచ్‌ల సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ వినతిపత్రం సమర్పించింది. ఈ సందర్భంగా కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు సుర్వి యాదయ్య గౌడ్ మాట్లాడుతూ.. మహాత్మా గాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం కోసం పాటుపడ్డ సర్పంచ్‌ల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం కనికరించడం లేదన్నారు. గ్రామాల్లో అభివృద్ధి పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లులు ఇవ్వకుండా ఏడాది కాలంగా సర్పంచ్‌లను గోస పెడుతున్నదని మండిపడ్డారు. పెండింగ్ బిల్లులు చెల్లించకపోవడంతో.. ఆర్థిక ఇబ్బందులు కొంతమంది సర్పంచ్‌లు ఆత్మహత్య చేసుకున్నారని తెలిపారు. కొందరి సర్పంచ్ కుటుంబాలు చిన్నాభిన్నం అయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. అభివృద్ధి పనుల కోసం తీసుకొచ్చిన డబ్బులకు వడ్డీలు కట్టలేక వేధింపులకు గురవుతున్నారని పేర్కొన్నారు. ఇక మాజీ సర్పంచ్‌లను ముప్పతిప్పలు పెడుతున్నారు.. వీలైనంత త్వరగా పెండింగ్ బిల్లులను చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుంటి మధుసూదన్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాంపాక నాగయ్య, ఉపాధ్యక్షుడు కేశబోయిన మల్లయ్య, గణేష్, నవీన్ కుమార్, పల్లె వెంకటేశం, సంఘం రాష్ట్ర నాయకులు ప్రణీత్ చంద్, బాషబోయిన ఉప్పలయ్య, లాగ్గాని రమేశ్, పూర్ణ చందర్ గౌడ్ రాష్ట్ర కమిటి తదితరులు పాల్గొన్నారు.

# ఒక లెక్క ఉంది !

హైదరాబాద్,కాంగ్రెస్ ముఖ్యమంత్రిగా ఏ రకమైన ఇబ్బందులూ లేకుండా ఏడాది పాలనను పూర్తి చేసుకోవడం అన్నది తెలంగాణా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సాధించిన ఘనత గానే చూడాలి. ఎందుకంటే కాంగ్రెస్ అనే మహా సముద్రంలో ఎందరో నాయకులు ఉంటారు. అందరూ కాకలు తీరిన యోధులే. అంతే కాదు అందరూ పాత కాపులూ అనుభవంలో రాటు తేలిన వారే. వారి మధ్యన పట్టుమని పదేళ్ల పాటు కూడా కాంగ్రెస్ నాయకుడిగా ముద్ర లేని రేవంత్ రెడ్డి సీఎం హోదాలో నిభాయించుకుని రావడం అంటే మాటలు అయితే కానే కాదు.అయితే రేవంత్ రెడ్డికి ఇది ఎలా సాధ్యమైంది అంటే ఆయన వెనక అండగా కాంగ్రెస్ అధినాయకత్వం ఉంది. తెలంగాణాను ప్రకటించినా కూడా తమకు అధికారం దక్కకపోయింది కదా అన్న చింతలో ఉన్న కాంగ్రెస్ కి అధికారాన్ని తెచ్చి చూపించిన వారు రేవంత్ రెడ్డి. ఆయన మాస్ లీడర్. జనంలోకి వెళ్తే వారిని ఆకట్టుకునేలా మాట్లాడగల దిట్ట.అందుకే కాంగ్రెస్ ఆయనను ఏరి కోరి పీసీసీ చీఫ్ గా చేసింది. ఆ మీదట అక్కడ నుంచి సీఎం గానూ ప్రతిష్టించింది. ఈ మధ్యలో ఎందరు సీనియర్లు అలకలు పోయినా కాంగ్రెస్ అయనకే చాన్స్ అని చెప్పేసింది. ఎందుకు అంటే కేసీఆర్ లాంటి మాటకారిని దూకుడు నేతను అంతే స్థాయిలో ఎదుర్కొనే సత్తా ఉన్న వారుగా ఆయనను కాంగ్రెస్ హై కమాండ్ భావిస్తోంది. అందుకే ప్రోత్సహిస్తోంది.ఇది ఒక విధంగా రేవంత్ రెడ్డికి అదృష్టంగానే చెప్పాలి. వైఎస్సార్ తరువాత కాంగ్రెస్ సీఎంలలో ఆ మాదిరి స్వేచ్చను అందుకున్న నాయకుడిగా రేవంత్ రెడ్డి ఉన్నారు. ఇక కాంగ్రెస్ కి దేశంలో అప్రతిహత విజయాలు కూడా ఏమీ దక్కడం లేదు. అందుకు కూడా తెలంగాణాను కెలకాలని అనుకోవడం లేదు. అది కూడా రేవంత్ రెడ్డికి ప్లస్ పాయింట్ గా మారుతోంది.ఇక రాజకీయంగా చూస్తే రేవంత్ రెడ్డి టీడీపీ నుంచి వచ్చిన వారు. ఆయనకు అక్కడ నేతలతోనూ మంచి రిలేషన్స్ ఉన్నాయి. తనకంటూ ఒక వర్గాన్ని ఆయన డెవలప్ చేసుకున్నారు. ఈ రోజున కాంగ్రెస్ ఎమ్మెల్యేలలో చూస్తే ఆయన కోసం ఉండేవారే అధికంగా కనిపిస్తారు. ఆ మీదట తెలంగాణాలో రాజకీయ సమీకరణలు కూడా రేవంత్ రెడ్డి సీఎం పదవిని కాపు కాస్తున్నాయి.చాన్స్ దొరికితే దూసుకుని పోదామని చూస్తున్న బీజేపీ అవసరం అయితే ఏమైనా చేస్తుంది అన్నది కాంగ్రెస్ పెద్దలకు కూడా తెలుసు అని అంటారు. ఏది ఏమైనప్పటికీ రేవంత్ రెడ్డి కాంగ్రెస్ కి బలమైన నాయకుడిగా కనిపించారు. ఆయననే కొనసాగిస్తున్నారు. అయితే రేవంత్ రెడ్డి దూకుడుగా నిర్ణయాలు తీసుకుంటున్నారు.దాని వల్ల కాంగ్రెస్ ఇబ్బందులు పడుతుందా లేదా అన్నది భవిష్యత్తు చెబుతుంది. సినీ పరిశ్రమతో ఏ ముఖ్యమంత్రీ కూడా పెట్టుకోరు. మరీ ముఖ్యంగా చూస్తే కాంగ్రెస్ ముఖ్యమంత్రులు చాలా ఫ్రెండ్లీగా ఉంటూ వచ్చారు. కానీ రేవంత్ రెడ్డి మాత్రం గట్టిగానే ఉంటున్నారు.వారిని పిలిచి మాట్లాడినపుడు ప్రభుత్వం తరఫున ప్రతిపాదనలు పెట్టారు కానీ వారి విన్నపాలను ఏ మేరకు అంగీకరించారో తెలియదు. పైగా బెనిఫిట్ షోలు లేవు అనేశారని టికెట్లు పెంపు ఉండదని చెప్పేశారని కూడా అంటున్నారు.ఇది సినీ పరిశ్రమను షాక్ లోకి నెట్టేదే అంటున్నారు. ముంగిటలో సంక్రాంతి వంటి బ్రహ్మాండమైన సీజన్ ని ఉంచుకుని ఈ విధంగా చేసుకోవడం అంటే కచ్చితంగా నష్టపోతామన్న భయం అయితే సినీ పరిశ్రమలో ఉంది. దానికి తోడు ఒక పాన్ ఇండియా హీరో అరెస్ట్, మరో పాపులర్ హీరోకి చెందిన కన్వెషన్ ని కూల్చివేయడం వంటివి కూడా చర్చకు వద్దన్నా వస్తాయనే అంటున్నారు.ఇక హైడ్రా పేరుతో చేసిన దూకుడు కూడా సామాన్యులకు అది చేరనంతవరకే వారి చప్పట్లకు నోచుకుంది. మూసీ నది సుందరీకరణ అంటూ చేసిన ప్రయత్నాలకు బ్రేకులు పడడం వెనక సామాన్యుడి రెడ్ సిగ్నల్ ఉందని అంటున్నారు. ఇలా నిర్ణయాలు ఎపుడూ అందరినీ సంతృప్తి పరచవు.

# గుదిబండగా మారనున్న డిటెన్షన్ పద్ధతి




న్యూఢిల్లీ,భారతదేశంలో పాఠశాల విద్యకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం నో డిటెన్షన్ విధానాన్ని రద్దు చేసి దాని స్థానే డిటెన్షన్ విధానాన్ని తీసుకురావాలని కీలక నిర్ణయం తీసుకుంది. పాఠశాల విద్యలో ఐదు, ఎనిమిది తరగతుల విద్యార్థులు వారి వార్షిక పరీక్షల్లో తప్పనిసరిగా ఉత్తీర్ణులు కావాలి. ఒకవేళ విద్యార్థులు ఉత్తీర్ణులు కాకపోతే వారికి రెండు నెలల్లో మరోసారి పరీక్షలు నిర్వహించాలి. రీ-ఎగ్జామ్‌లో కూడా విద్యార్థులు ఫెయిల్ అయితే సదరు విద్యార్థులు మళ్లీ ఆయా తరగతుల్లోనే చదవాల్సి ఉంటుంది. పాఠశాల విద్య రాష్ట్ర జాబితాలోని అంశం కావున ఈ నిర్ణయం అమలు రాష్ట్ర స్థాయిలో జరుగుతుందని, కానీ కేంద్రీయ విద్యాలయాలు, నవోదయ, సైనిక పాఠశాలలకు విధిగా ఈ నిర్ణయం వర్తిస్తుందని స్పష్టం చేసింది. తెలుగు రాష్ట్రాల్లో మాత్రం ప్రస్తుతం 'నో డిటెన్షన్ విధానమే' కొనసాగుతుంది.6 నుండి 14 సంవత్సరాల బాలలందరికీ ఉచిత నిర్బంధ విద్యను అందించడానికి బాలల ఉచిత నిర్బంధ విద్యాహక్కు చట్టం - 2009 (ఆక్ట్ 35 ఆఫ్ 2009), 2009 ఆగస్టు 26న రాష్ట్రపతి ఆమోదం పొంది అమల్లోకి వచ్చింది. విద్యాహక్కు చట్టానికి 2019 మార్చిలో చేసిన సవరణ ప్రకారం దేశ వ్యాప్తంగా 16 రాష్ట్రాలు, రెండు కేంద్రపాలిత ప్రాంతాలు ఇప్పటికే ఈ రెండు తరగతులకు(5,8) నో డిటెన్షన్ విధానాన్ని తొలగించాయని కేంద్రం స్పష్టం చేసింది. పాఠశాల విద్య రాష్ట్ర జాబితాలోని అంశం కావున ఈ నిర్ణయం అమలు రాష్ట్రస్థాయిలో జరుగుతుందని, కానీ కేంద్రీయ విద్యాలయాలు, నవోదయ, సైనిక్ పాఠశాలలకు విధిగా ఈ నిర్ణయం వర్తిస్తుందని స్పష్టం చేసింది. తెలుగు రాష్ట్రాల్లో మాత్రం ప్రస్తుతం 'నో డిటెన్షన్ విధానమే' కొనసాగుతుంది.

బలహీనవర్గాలకు విద్య దూరం..

కేంద్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు 5,8 తరగతుల్లో డిటెన్షన్ విధానం అమలు జరిగితే ప్రభుత్వ విద్యా సంస్థల్లో డ్రాపౌట్స్ పెరుగుతారు, బడుగు బలహీనవర్గాలకు విద్య దూరమయ్యే ప్రమాదం ఉంది. విద్యాహక్కు చట్టం ప్రకారం 6 నుండి 14 సంవత్సరాల వయసు వరకు బాలలకు ఉచిత నిర్బంధ విద్యను అందించాల్సి ఉంటుంది. 8వ తరగతి వరకు ఏ ఒక్క విద్యార్థినీ ఫెయిల్ లేదా నిలుపుదల చేయకూడదు. కానీ కేంద్ర ప్రభుత్వం జాతీయ విద్యావిధానం (NEP -2020) అమలు పేరుతో విద్యా హక్కు చట్టానికి తూట్లు పొడుస్తూ నో డిటెన్షన్ విధానాన్ని రద్దు చేసి డిటెన్షన్ పద్ధతిని తీసుకువచ్చింది. 2018 లోనే కేంద్ర ప్రభుత్వం డిటెన్షన్ పద్ధతి ప్రతిపాదన తీసుకురాగా ఆనాడే ప్రగతిశీల ప్రజాస్వామిక వాదులు, విద్యావేత్తలు, మేధావులు వ్యతిరేకించారు. నాటి తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి కడియం శ్రీహరి రాష్ట్రంలో డిటెన్షన్ విధానాన్ని అమలు జరపబోమని ప్రకటించారు.

ఇంగ్లీషులో రెండు వాక్యాలు చదవలేరు..

26.5 కోట్ల మంది విద్యార్థులు,14.9 లక్షల పాఠశాలలు, 95 లక్షల మంది ఉపాధ్యాయులతో భారతీయ విద్యా వ్యవస్థ ప్రపంచంలోనే అతిపెద్ద విద్యా వ్యవస్థగా గుర్తింపు పొందింది. అసర్‌రిపోర్ట్ -2023 ప్రకారం భారతదేశంలోని 26 రాష్ట్రాల్లో 28 జిల్లాల్లో 34,745 మంది 14-18 వయసు గల వారిని సర్వే చేస్తే వారిలో 42.7% ఇంగ్లీష్ లో కనీసం రెండు వాక్యాలు కూడా చదువలేకపోతున్నారు. 2 వ తరగతి పాఠ్య పుస్తకాలు వారి ప్రాంతీయ భాషల్లో చదవడం లేదు. కేవలం 43% మాత్రమే చతుర్విధ ప్రక్రియలుచేయ గలుగుతు న్నారు. ఈ రిపోర్టు ఆధారంగా 50% విద్యార్థుల్లో కనీస అభ్యసన సామర్థ్యాలు లోపించాయని మనకు స్పష్టంగా తెలుస్తుంది. వీరంతా పాఠశాల విద్యను పూర్తి చేసుకున్న వారే, వీరి అభ్యసన స్థాయిలే ఇలా ఉంటే 5,8 తరగతుల విద్యార్థులకు వారి వార్షిక పరీక్షల్లో ఎలా ఉత్తీర్ణత సాధిస్తారు. వారి అభ్యసన సామర్థ్యాలు ఎలా ఉంటాయో మనం అర్థం చేసుకోవచ్చు. గ్రామీణ, బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు డిటెన్షన్ విధానం గుదిబండగా మారనుంది.

డిటెన్షన్ విధానం పరిష్కారమా?

కేంద్ర ప్రభుత్వ విద్యా మంత్రిత్వ శాఖ గణాంకాల ప్రకారం గత సంవత్సరం 65 లక్షల మందికి పైగా విద్యార్థులు 10 మరియు 12 వ తరగతి బోర్డు పరీక్షలను ఉత్తీర్ణులు కాలేకపోయారు. ఫెయిల్యూర్ రేటు జాతీయ బోర్డులతో పోల్చుకుంటే రాష్ట్ర బోర్డుల్లో ఎక్కువగా ఉంది. పాఠశాల స్థాయిలో విద్యార్థుల్లో ప్రమాణాలు పడిపోతున్నాయని ప్రమాణాలు పెంచడం కోసం 5, 8 తరగతిలో వార్షిక పరీక్షలు తప్పనిసరిగా ఉత్తీర్ణులు కావాలనే నిర్ణయం తీసుకున్నామని

# 'ఎజెండా 2025' ఓ సవాల్,చాన్స్!

హైదరాబాద్,రాజకీయాల్లో సవాల్ అనిపించేది ఓ చక్కని అవకాశమవుతుంది. ఓ మంచి అవకాశంగా కనిపించేది సవాల్ అయి నిలిస్తుంది. అటువంటి అనిశ్చితిలో సమయస్ఫూర్తితో వ్యవహరించి, ఎప్పుడు దేన్ని ఎలా మలచుకుంటారు అన్నదాన్ని బట్టే జయాపజయాలు ఆధారపడి ఉంటాయి. ఇది పలుమార్లు రుజువైన సత్యం. అసెంబ్లీకి ఎన్నికలు జరిగి, కొత్తగా ప్రభుత్వం ఏర్పాటై ఏడాది పూర్తయినా తెలంగాణలో ఇప్పుడు రాజకీయ పరిస్థితి అనిశ్చితంగా ఉంది. గాలివాటు రాజకీయాలే తప్ప ప్రణాళికాబద్ధమైన కార్యాచరణ ఎవరూ నడపట్లేదు. గ్రామ పంచాయతీలు, మండలజిల్లా పరిషత్‌లు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్లకు జరగాల్సిన స్థానిక సంస్థల ఎన్నికల ముంగిట్లో సంస్థాగతంగా మూడు ప్రధాన పార్టీల సన్నద్ధత అంతంత మాత్రమే! నవీకరించిన ఓటర్ల జాబితాలు సిద్ధమై, రిజర్వేషన్లు ఖరారయితే ఫిబ్రవరిలో ఈ ఎన్నికలకు ఆస్కారముంది. 2023 24 ఫలితాలు, పరిణామాలు, పరిస్థితులను సమీక్షించుకొని 2025 కు కార్యాచరణ సిద్ధం చేసుకోవాల్సిన తరుణంలో%ో% ఎవరి పరిస్థితి ఏమిటి? ఓ సింహావలోకనం! రాజకీయ పార్టీలకు ఏడాదుల కాలపు సరిహద్దులేముంటాయనే సందేహం రావొచ్చు! కాలరేఖలు సంకెళ్లు కావేమో కానీ, పార్టీలు సమీక్షకు సిద్ధపడితే%ో% రెండు ముఖ్య ఎన్నికలు ముగిసి, మూడో ఎన్నికలకు వెళుతుండటం ఓ మైలు రాయే!

మారకుంటే మారదంతే!

ఉద్యమం నుంచి పుట్టిన ప్రతిపక్ష పాత్రకి, పదేళ్లు అధికారం అనుభవించిన తర్వాతి ప్రతిపక్ష పాత్రకి తేడా ఉంటుంది. ఈ సూక్ష్మాన్ని భారత్ రాష్ట్ర సమితి బిఆర్ఎస్ గ్రహించాలి. ఒక విమర్శ చేసే ముందు, అదే విషయంలో 'పదేళ్లు మనమేం చేశాం?' అని ప్రశ్నించుకోవాలి. రాజకీయంగా కాక, నిజాయితీగా ప్రజాపక్షం వహిస్తే లేవనెత్తాల్సిన అంశాలు, ప్రభుత్వాన్ని ఎండగట్టాల్సిన విషయాలు, విపక్షం దెబ్బకు ప్రభుత్వం తప్పుదిద్దుకొని ప్రజలకు మేలు కలిగించాల్సిన విధానాలు వేరుంటాయి. వాటిని జాగ్రత్తగా ఎంపిక చేసుకోవాలి. అన్ని విషయాల్లో నిందిస్తూ ఉంటే, 'ఇక దిగిపోండి, దిగిపోండి, మేమొచ్చి కూర్చుంటాం%ో%'అన్నట్టు ప్రవర్తిస్తే దాన్ని ప్రజలు మెచ్చరు. ఎన్నికల్లో ఓడించి, తెలంగాణ సమాజం ప్రతిపక్ష బాధ్యత అప్పగించి ఏడాదయినా.. బిఆర్ఎస్ సమర్థంగా ఆ పాత్ర పోషించలేకపోతోందనే భావన ప్రజల్లో ఉంది. అది పోయేలా నడచుకోవాల్సిన బాధ్యత బిఆర్ఎస్‌దే! 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిన చేదు అనుభవం, 2024 లోక్‌సభ ఎన్నికల్లో చేతులు కాలడం%ో% ఎందుకు జరిగింది? అన్న లోతైన, నిజాయితీ సమీక్ష ఇంతవరకూ జరుగలేదు. జాతీయ పార్టీ అంటూ నేలవిడిచి సాము చేయడం, తప్పులు అంగీకరించని స్థితి, విమర్శలు సహించని అసహనం, నియంతృత్వ పోకడ%ో% వల్ల పదేళ్లు మధ్యంతర దిద్దుబాటు లేకుండాపోయింది. ఈ ఆత్మశోధన లేక, ప్రజాసంబంధ విషయాల్లో ఇప్పుడు ఎలా నడచుకోవాలో వారికి బోధపడుతున్నట్టు లేదు. పార్టీ అధినేత చంద్రశేఖరరావు అటు ప్రజాక్షేత్రానికో, ఇటు అసెంబ్లీకో రాకపోవడం ఒక లోపమే! పార్టీ శాసన సభాపక్ష కార్యవర్గాన్ని ఖరారు చేయకపోవడంతో%ో% సర్కారుకు గట్టిగా అడ్డుతగులుతున్న హరీశ్‌రావును, 'ఇంతకీ నీది ఏ హోదా?' అని, పాలకపక్షం ఎకసక్కాలాడే పరిస్థితిని పార్టీయే కల్పిస్తోంది. 'కాళేశ్వరం నుంచి ఫార్ములా ఈ రేస్' దాకా బిగుస్తున్న పలు కేసుల ఉచ్చు.. ఎక్కడిదాకా పోతుందో తెలీదు. రెండు వరుస ఓటముల తర్వాత నిస్తేజంగా మారిన పార్టీ పునర్నిర్మాణం జరగాలి. 'ఇక బిఆర్ఎస్ పని అయిపోయింది' అనే మౌఖిక ప్రచారం పెరిగితే, ఆ రాజకీయ శూన్యతలోకి బిజెపి విస్తరించే ఆస్కారం బలంగా ఉంది. ఆ పరిస్థితిని అధిగమించి, పార్టీకి పూర్వవైభవం తేవాలంటే స్థానిక సంస్థల ఎన్నికలు వారికొక మంచి అవకాశం. అదే వారి ఎజెండా 2025!

జనంలోకి వెళితేనే జరుగుబాటు

'కలలు కనడానికి నిద్రపోవాలి, వాటని సాకారం చేసుకోవడానికి మాత్రం మేల్కొనాలి' అన్నది పెద్దల మాట! దాని సారాన్ని తెలంగాణ బిజెపి గ్రహించాలి. ప్రతిపక్షంగా ప్రజా సమస్యలపై పోరాడాల్సింది పోయి, నాయకత్వ స్థానాల కోసం రాష్ట్ర నేతలు ఒకరికాళ్లు వేరొకరు లాక్కుంటున్నారు. రాష్ట్రాధ్యక్ష స్థానం కోసం పాతకొత్త స్పర్థతో నాయకులు పోటీపడటమే కాకుండా, పరస్పర హననానికీ వెనుకాడటం లేదు. 'పార్టీలో ఐక్యత లోపించి, అధికారంలోకి రావాల్సిన చోట స్వయంకృతాపరాధంతో ఓడిపోయార'ని చివరకు పార్టీ అగ్రనేత, ప్రధానితో చివాట్లు తినాల్సి వచ్చింది. 2023 అసెంబ్లీ ఎన్నికల ఫలితమొక 'భంగపాటు' అయితే 2024 లోక్‌సభ ఎన్నికల ఫలితం, 4 నుంచి 8 స్థానాలకు ఎదుగుదలే అయినా ఆశించిన సంఖ్య దక్కని కంటితుడుపే! 'గెలిచిన 8 అసెంబ్లీ, 8 లోక్‌సభ




స్థానాలు కలిపితే 88, కనుక తెలంగాణలో వచ్చే ఎన్నికల్లో ప్రభుత్వం మాదే!' అన్నట్టు భావిస్తున్న నాయకులు కలల్లో విహరిస్తున్నారు. హర్యానా, మహారాష్ట్ర గెలుపు సంబరాలే తప్ప, వాటి ప్రత్యక్ష ప్రభావం తెలంగాణలో ఉండాలంటే సంస్థాగతంగా బలపడాలనే గ్రహింపు రాష్ట్ర నాయకత్వానికి వస్తున్నట్టు లేదు. గత ఎన్నికల్లో పోటీ పడ్డ అభ్యర్థుల్లో 40 శాతం పార్టీని వీడి వెళ్లారంటే, ఎవరెవరికి టిక్కెట్లు దక్కాయో%ో% తేలిగ్గానే అర్థం చేసుకోవచ్చు! అగ్రనేతలు కిషన్ రెడ్డి, బండి సంజయ్, డా.లక్ష్మణ్, ఈటెల తదితరుల నియోజక వర్గాల పరిధిలోనూ మంచి ఫలితాలు రాలేదు. 'ఎన్నికలు ముంచుకొస్తుంటే, ఆపద్ధర్మంగానే కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని అధ్యక్షుడిని చేసినట్టు ప్రధానే స్వయంగా వెల్లడించారు. కానీ, ఇప్పటివరకు కొత్త అధ్యక్షుడిని నియమించకపోవడానికి రాష్ట్ర నాయకత్వంలో నెలకొన్న అనారోగ్యకర పోటీయే కారణం. తనకు అనుకూలంగా, సోషల్ మీడియా వేదికగా బండి సంజయ్ ఏదో రాయించుకున్నట్టు ఢిల్లీ వరకు ప్రచారం వెళ్లడం వల్లే, 'పోటీలో నేను లేను' అని ఆయనే స్వయంగా వివరణ ఇచ్చుకోవాల్సి వచ్చింది. ఇప్పుడు కొత్త అధ్యక్షుడిని నియమించుకోవడం, సయోధ్యతో అందర్నీ ఒకతాటిపైకి తెచ్చుకోవడం, స్థానిక ఎన్నికలను పార్టీ బలోపేతానికి వేదిక చేసుకోవడం%ో% ఇవన్నీ ఎజెండా 2025 సవాళ్లే!సంసారం మొదలవాలిదంపతుల మధ్య చనువు, సఖ్యత పెరగటానికి 'హనీమూన్' టానిక్‌లా పని చేస్తుంది. కానీ, అదే దాంపత్య జీవితం అవదు! ఎక్కడో ఓ చోట హనీమూన్ ముగిస్తే, అసలు సంసారం మొదలవుతుంది.తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం తన హనీమూన్ ముగిసిందని గ్రహించాలి. సర్కారు ఏర్పడి ఏడాది ముగిసినా 2023 విజయోత్సవ మత్తులోంచి నాయకత్వం ఇంకా బయటపడుతున్నట్టు లేదు. సన్మాన సత్కార సంబరాల సందడే సాగుతూ ఉంది. పట్టుతో పాలన గాడిన పడటం లేదు. మంత్రుల మధ్య సమన్వయం, శాఖల వారీగా సమీక్షలు, హామీలు విధానాల అమలు, పాత ప్రభుత్వాన్ని మరిపించేలా కొత్త సర్కారు తనదైన ముద్ర వేయడం%ో% ఇవేవీ బలంగా వేళ్లానుకోలేదన్నది జనాభిప్రాయం. ప్రభుత్వం 'ఉమ్మడిగా' పనిచేస్తున్న భావన రావట్లేదు, తక్కువ సమయంలోనే ప్రజాక్షేత్రంలో 'గుడ్‌విల్' కరిగిపోయింది. శాసనసభ సమావేశాల్లో హాజరీ కూడా గొప్పగా లేదు. 'విప్'ల సమన్వయం అంతంతే! ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీసిఎం భట్టి విక్రమార్క, శాసన సభ వ్యవహారాల మంత్రి శ్రీధర్ బాబు, అప్పుడప్పుడు రవాణా బిసి సంక్షేమ మంత్రి పొన్నం ప్రభాకర్ తప్ప సభా వ్యవహారాలను మంత్రిర్గం ప్రభావితం చేస్తున్న జాడలు లేవు. తగు సన్నద్ధత లేకనేమో, పలు విషయాల్లో విపక్షమే ఆధిక్యత సాధిస్తోంది, సర్కారు వారిని సమర్థంగా ఎదుర్కొంటున్న సంకేతాలు రావట్లేదు. ఇక కెసిఆర్ సభకు వస్తే పరిస్థితి ఏమిటి? అనే ప్రశ్న సహజం. కొత్త పిసిసి నేత, కొందరు నాయకులకు పదవులు వచ్చాయి తప్ప పార్టీపరంగా పెద్ద మార్పు లేదు. పిసిసి కొత్త కార్యవర్గం ఏర్పడలే, సిఎల్‌పి కార్యవర్గం రూపుదాల్చలే! మహేష్ కుమార్ గౌడ్ టిపిసిసి పగ్గాలు చేపట్టి వంద రోజులవుతున్నా ఆయనదైన పనితీరు ఇంకా మొదలైనట్టు లేదు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, సానుభూతిపరుల్లో పనులు జరగట్లేదన్న అసంతృప్తి మొదలైంది. నాయకుల ఇళ్ల దగ్గర, వారి ఆఫీసుల్లో సందడి మాత్రం తగ్గలేదు. ఏం చేసినా రాజధాని గ్రేటర్ హైదరాబాద్‌లో పార్టీ బలోపేతం కావట్లేదు. అసెంబ్లీ, లోక్‌సభ స్థానాలు ఒకటైనా దక్కలేదు, వారిచ్చిన పిలుపుల ప్రకారం కనీస కార్యక్రమాలు కూడా విజయవంతం కావట్లేదు. పార్టీ సంస్థాగత వ్యవహారాల ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల ప్రభావమేమో రాష్ట్ర పార్టీ నేతల కేరళ పర్యటనలూ పెరిగాయి. కాంగ్రెస్, బిఆర్ఎస్, బిజెపి తెలంగాణలో మూడు పార్టీలకూ 2025కు నిర్దిష్ట ఎజెండా ఉంది. సవాళ్లను అవకాశంగా మలచుకుంటూ, ఎజెండా 2025 సాధించుకుంటే తప్ప 2028 కి బాటపడదు. పయనం అటైనా, ఇటైనా చేసుకున్నోళ్లకు చేసుకున్నంత!.

# అల్లు అర్జున్ బెయిల్ పిటిషన్ విచారణ

హైదరాబాద్, నటుడు అల్లు అర్జున్ బెయిల్ పిటిషన్‌పై విచారణను నాంపల్లి కోర్టు సోమవారానికి వాయిదా వేసింది. బెయిల్ పిటిషన్‌పై కౌంటర్ దాఖలు చేయడానికి పోలీసులు సమయం కోరారు. సంధ్య థియేటర్ ఘటనలో నాంపల్లి కోర్టులో జరిగిన విచారణకు వర్చువల్‌గా అల్లు అర్జున్ హాజరయ్యారు. విచారణను జనవరి 10కి నాంపల్లి కోర్టు వాయిదా వేసింది. గతంలో అల్లు అర్జున్‌కు నాంపల్లి కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. రిమాండ్ గడువు ముగియడంతో కోర్టు ముందుకు అల్లు అర్జున్ హాజరయ్యారు. డిసెంబర్ 4న ఆర్ టిసి క్రాస్ రోడ్డులో సంధ్య థియేటర్ లో పుష్ప 2 సినిమా విడుదల కావడంతో పాటు హీరో అల్లు అర్జున్ అక్కడికి రావడంతో తొక్కిసలాట జరిగి రేవతి అనే మహిళ మృతి చెందిన విషయం తెలిసిందే. మొత్తంగా టాలీవుడ్ హీరో అల్లు అర్జున్ బెయిల్ పిటిషన్ విచారణ సోమవారానికి వాయిదా పడింది. ప్రస్తుతం మధ్యంతర బెయిల్ మీద బయట ఉన్న అల్లు అర్జున్ రెగ్యూలర్ బెయిల్ పిటిషన్ కోసం నాంపల్లి కోర్టులో పిటిషన్ వేశారు. మరోవైపు రెండు వారాల జ్యుడీషియల్ రిమాండ్ గడువు సైతం పూర్తి కావడంతో హైకోర్టు మధ్యంతర బెయిల్ ఇచ్చిన విషయాన్ని నాంపల్లి కోర్టుకు తెలిపారు. రెగ్యూలర్ బెయిల్ పిటిషన్ కోసం అల్లు అర్జున్ తరఫున ఆయన లాయర్లు కోర్టులో పిటిషన్ వేశారు. నాంపల్లి కోర్టు ఈ పిటిషన్ విచారణ స్వీకరించింది. కోర్టులో విచారణ ప్రారంభం కాగా, కౌంటర్ ధాఖలు చేసేందుకు పబ్లిక్ ప్రాసిక్యూటర్ సమయం కోరారు. దాంతో నాంపల్లి కోర్టు తదుపరి విచారణ వచ్చే సోమవారానికి వాయిదా వేసింది. అల్లు అర్జున్ నేరుగా కాకుండా వర్చువల్ గా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విచారణకు హాజరయ్యారు. మొదట అల్లు అర్జున్ విచారణకు వస్తారని నాంపల్లి కోర్టు వద్ద పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. అయితే వర్చువల్‌గా హాజరు అవుతారని ఆయన తరఫున లాయర్లు కోర్టు దృష్టికి తీసుకెళ్లగా, అల్లు అర్జున్ అభ్యర్థనను కోర్టు మన్నించింది. నాంపల్లి కోర్టు విధించిన జ్యుడీషియల్ రిమాండ్ గడువు నేటితో ముగియనుందని విచారణ జరిపారు. పుష్ప 2 ప్రీమియర్ షో సందర్భంగా డిసెంబర్ 4వ తేదీన సంధ్య థియేటర్ వద్ద తొక్కిసలాట ఘటనలో రేవతి అనే మహిళ చనిపోగా, ఆమె కుమారుడు కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. థియేటర్ వద్ద తొక్కిసలాట కేసు విచారణనూ సైతం నాంపల్లి కోర్టు వాయిదా వేసింది. జనవరి 10వ తేదీన తదుపరి విచారణను చేపట్టనున్నట్లు కోర్టు వెల్లడించింది. అల్లు అర్జున్ రిమాండ్ పై సైతం అదేరోజు విచారణ జరగనుంది.

# పిహెచ్‌డి విద్యార్థి బలవన్మరణం

హైదరాబాద్, కానిస్టేబుల్ వేధింపులు భరించలేక పరిశోధక విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న ఘటన కలకలం రేపింది. ఈ ఘటన నాచారం పోలీస్ స్టేషన్ పరిధిలో కలకలం రేపింది. ఉద్యోగం ఇప్పిస్తానని తండ్రి తీసుకున్న డబ్బు తిరిగివ్వాలని వేధించడంతో మనస్తాపానికి గురైన దీప్తి ఉరేసుకుని బలవన్మరణాని పాల్పడింది. ఈ కేసులో సంగీతరావు, అనిత, ఆమె తండ్రి సోమయ్యను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. అనిత భర్త అనిల్, సైదులు పరారీలో ఉన్నట్టు పోలీసులు తెలిపారు.నాచారం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఘటన వివరాలిలా ఉన్నాయి. నాచారంలోని బాపూజీనగర్ సరస్వతీకాలనీకి చెందిన పులివర్తి దీప్తి(28) హబ్సిగూడలోని ఐఐసీటీ(ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ)లో ప్రాజెక్టు అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. దీప్తి తండ్రి సంగీతరావు ఐఐసీటీలో పనిచేసి పదవీ విరమణ పొందారు. సంగీతరావుకు డీజీపీ కార్యాలయంలో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న బెల్లా అనిల్‌తో పరిచయముంది. సంగీతరావు.. అనిల్ భార్య అనితకు ఐఐసీటీలో ఉద్యోగం ఇప్పిస్తానని రెండేళ్ల క్రితం రూ.15 లక్షలు తీసుకున్నాడు. ఈ ఏడాది సెప్టెంబరు వరకూ ఉద్యోగం ఇప్పించలేదు. దీంతో అనిల్ తన డబ్బు తిరిగివ్వాలని దీప్తిని అడిగేవాడు. డబ్బు తన తండ్రి తీసుకున్నాడని, ఆయన తమతో చాలా ఏళ్ల నుంచి కలిసి ఉండడం లేదని సమాధానం చెప్పింది. అనిల్ పట్టించుకోకుండా తన భార్యతో నాచారం ఠాణాలో ఫిర్యాదు చేయించాడు. దీప్తి, సంగీతరావు మీద ఛీటింగ్ కేసు నమోదైంది. అనిల్, అనిత న్యాయస్థానంలో సివిల్ దావా కూడా వేశారు. మనస్తాపానికి గురైన దీప్తి బుధవారం రాత్రి 10 గంటల సమయంలో చున్నీతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. తల్లి వచ్చి చూసేసరికి అప్పటికే మరణించింది. ఫోన్ తనిఖీ చేస్తే.. సెల్ఫీ వీడియో ఉంది. నాచారం పోలీసులు అనిత, అనిల్, సోమయ్య, సైదులు మీద కేసు నమోదు చేశారు. 'నా మరణానికి అనిల్, ఆయన భార్య అనిత, ఆమె తండ్రి సోమయ్య కారణం. నాన్న డబ్బు తీసుకుంటే నామీద నకిలీకేసు నమోదు చేయించి జీవితాన్ని నాశనం చేశారు. ఈ కేసుల మీద పోరాడే స్థోమత లేదు. నా మరణంతోనైనా కుటుంబానికి న్యాయం జరుగుతుంది. నా చావుకు కారణమైన వాళ్లకు శిక్షపడాలి. నా మృతదేహాన్ని వైద్య పరిశోధనకు ఇచ్చేయండి' అని కన్నీరు పెట్టుకుంటూ సెల్ఫీ వీడియో చిత్రీకరించింది. దీప్తి తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# పొన్నం గురి..

కరీంనగర్: కరీంనగర్‌లో పొలిటిక్స్ ఇప్పుడే హీట్ ఎక్కాయి . మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలకు ఇంకా టైమ్ ఉండగానే ఇద్దర బలమైనా నేతల మధ్య మాటల యుద్ధం మొదలైంది. కరీంనగర్ లో పట్టు నిలుపుకునేందుకు ఒకరు, పట్టును సాధించేందుకు మరొకరూ ప్రత్యేక వ్యూహాలతో ముందుకు వెళ్తున్నారు. కరీంనగర్ రాజకీయాలను అసెంబ్లీ వేదికగా ఇద్దరు నేతలు ప్రస్తావించి కొత్త చర్చకు దారి తీసారు. అసలు ఆ ఇద్దరు లీడర్ల టార్గెట్ ఏంటి?కరీంనగర్ ప్రాంతంలో రాజకీయ చైతన్యం ఎక్కువ. ఇక్కడ ప్రతిసారి రాజకీయాలు హాట్‌హాట్‌గా ఉంటాయి. ప్రస్తుతం ఎలాంటి ఎన్నికలు లేకున్నా అక్కడ రాజకీయాలు హాట్‌హాట్‌గా మారిపోయాయి. కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో పాగా వేసేందుకు మంత్రి పొన్నం, మాజీ మంత్రి గంగుల తమ వ్యూహాలకు పదును పెడుతున్నారు. ముఖ్యంగా ఈ ఇద్దరు నేతలు కరీంనగర్ ఎన్నికల్లో గతంలో ముఖాముఖి తలపడ్డారు. ఇప్పుడు కరీంనగర్ సిటీ కాంగ్రెస్‌కి మంత్రి పొన్నం ప్రభాకర్ పెద్దదిక్కుగా ఉంటే.. బీఆర్ఎస్‌లో ఎమ్మెల్యే గంగుల కమలాకర్ చక్రం తిప్పుతున్నారు.2023 ఎన్నికలలో కొన్ని సమీకరణాల కారణంగా కరీంనగర్ నుంచి కాకుండా హుస్నాబాద్ నుంచి పోటీ చేసి విజయం సాధించారు పొన్నం. దానిపై గంగులు కమలాకర్ తనకి భయపడే పొన్నం వేరే ప్రాంతంలో పోటీ చేశారని పలు సందర్భాల్లో విమర్శలు గుప్పించారు. అంతేకాకుండా ఇటీవల అసెంబ్లీ లో కూడా పొన్నం ప్రభాకర్ పై పరోక్షంగా విమర్శలు చేసారు. మంత్రి పొన్నం ప్రభాకర్ కూడ అసెంబ్లీ లో ధీటుగా కౌంటర్ ఇచ్చారు. ఈ విమర్శలు, ప్రతి విమర్శలు అసెంబ్లీకి పరిమితం కాకుండా కరీంనగర్ చుట్టూ కూడా తిరుగుతున్నాయి. రానున్న మున్సిపాల్ కార్పొరేషన్ ఎన్నికలు వీరిద్దరికి కీలకంగా మారాయి.కరీంనగర్‌లో బీఆర్ఎస్ కంచుకోటను బద్దలు కొడతానని గతంలోనే పొన్నం ప్రభాకర్ సవాల్ విసిరారు. గత రెండు ఎన్నికలలో కరీంనగర్ కార్పొరేషన్‌లో బీఅర్ఎస్ హవానే కొనసాగింది.

# దర్యాప్తు సంస్థలను బలోపేతం చేయాలి !




న్యూఢిల్లీ,కేంద్ర దర్యాప్తు సంస్థలు సిబిఐ, ఇడిలను బలోపేతం చేయడంతో పాటు నిజాయితీగా పనిచేసే సంస్థలుగా తీర్చిదిద్దాల్సి ఉంది. మెరికలైన అధికారులను వీటికి కేటాయించాలి. ఎలాంటి కేసునైనా ఛేదించి ఫలితం చూపేలా తయారు చేయాలి. దేశంలో అవినీతి, అక్రమాలకు పాల్పడిన వారి గుండెల్లో రైళ్లు పరుగెత్తించాల్సి అవసరం ఉంది. కానీ ఇప్పుడు రాజకీయ పార్టీలకు ఇడి, సిబిఐలు అంటే భయం లేకుండా పోయాయి. వీటి సమర్థతపై ఉన్న అనుమానాలే దీనికి కారణమని వేరుగా చెప్పనక్కరలేదు. ఈ విషయంలో మోడీ ప్రభుత్వం చిత్తశుద్ధిని చాటుకోవాల్సి ఉంది. కేవలం రాజకీయ కక్ష తీర్చుకునేందుకు వీటిని ఉపయోగి స్తున్నారన్న ఆరోపణల నుంచి బయటపడాలి. ఇప్పటివరకు ఏ ఒక్క కేసులోనూ నిగ్గు తేల్చిన దాఖలాలు లేవు. మద్యం కేసు కావచ్చు..ఇతర అవినీతి కేసులు కావచ్చు..ఏవీ ముందకు సాగడం లేదు. అంతెందుకు వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసును ఆరేళ్లయినా నిగ్గు తేల్చలేదు. అందుకే దర్యాప్తు సంస్థల ప్రతిష్టను పెంచేందుకు చిత్తశుద్ధితో పనిచేయాలి. ఇకపోతే ఢిల్లీ ఎన్నికలు దగ్గర పడుతున్న వేళ విమర్శలకు పదను పెడుతున్నారు. బిజెపికి కేజ్రీవాల్ సవాళ్లు విసురుతున్నారు. ఇదే క్రమంలో ఢిల్లీ సిఎం అతిషిపైనా కేసులు తప్పకపోవచ్చన్న ప్రకటన చేశారు. బిజెపి కేసులతో లొంగదీసుకోవాలని చూస్తోందని మండిపడ్డారు. నిజానికి బిజెపి ముందు ఇప్పుడు ఢిల్లీ ఎన్నికలు తప్ప మరో ఎన్నిక లేదని చెప్పాలి. ఢిల్లీలో మరోమారు అధికారం కోసం కేజ్రీవాల్ చెమటోడుస్తున్నారు. అయితే గతంతో పోలిస్తే అంత సులభంగా విజయం దక్కక పోవచ్చు. ఆప్‌కు చెందిన అనేకులు పార్టీని వీడి బిజెపిలో చేరారు. అయితే రాజకీయ ప్రత్యర్థులను వేధించడమే లక్ష్యంగా మోడీ సర్కారు కేంద్ర దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేయడానికి బరితెగిస్తోందన్న విమర్శలు వస్తున్నాయి. తమకు అనుకూలంగా ఉన్నవారిని ఒక రకంగా లేనివారిని మరో రకంగా చూస్తున్నారు. జగన్, కెసిఆర్ విషయంలో మాత్రం బిజెపి ఎందుకనో వెనకడుగు వేసింది. ఈ ఇద్దరిపైనా అవినీతి ఆరోపణలు చేసినా, పెద్దగా పట్టించుకోలేదు. ఇప్పటికీ బిఆర్ఎస్‌తో లోపాయకారి అవగాహన ఉందన్న ప్రచారం ఉంది. ఇక్కడ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎండగట్టడంతో పాటు, తెలంగాణలో ఓ ప్రాంతీయ పార్టీ అవసరం ఉందని బిజెపి గుర్తించివుంటుంది. అందుకే బిఆర్ఎస్ అవినీతిపై మాట్లాడినా పెద్దగా పట్టించుకోవడం లేదు. కవిత విసయంలో కూడా కేసు పెద్దగా బలంగా లేదన్న వాదనలు ఉన్నాయి. ఈ కేసులో కేజ్రీవాల్, కవితలు ఇద్దరూ బెయిల్‌పై బయలకు వచ్చారు. అందుకే గత కెస్ ప్రభుత్వంపై వచ్చిన అవినీతి ఆరోపణలపై బిజెపి నేతలు స్పందించడం లేదు. జగన్ లోపాయకారిగా బిజెపికి అనుకూలంగా ఉన్నాడని విమర్శలు ఉన్నాయి. తెలంగాణలో కూడా కెసిఆర్ అనుకూలంగా ఉన్నందువల్లే ఆయనపైనా ఈగ వాలనీయడంలేదని అంటున్నారు. ఈ విషయమై ఎన్ని విమర్శలు చేసినా కేంద్ర ప్రభుత్వ వైఖరిలో నామమాత్రపు మార్పు కూడా కనిపించడంలేదు. గతంలో విపక్షాలపై అదేపనిగా కేసులు పెట్టడంతో ప్రతిపక్షాలన్నీ కలిసి మూకుమ్మడిగా అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించాల్సి వచ్చింది. ఇడి, సిబిఐ వంటి సంస్థలను తమ జేబు సంస్థలుగానే మోడీ ప్రభుత్వం భావిస్తోందని ఇండియా కూటమి బాహాటంగానే విమర్శిస్తోంది. ప్రతిపక్షనేతలను నయానో, భయానో లొంగదీసుకోవడానికి, అలా లొంగని వారిని కేసులతో వేధించడానికి ఆ సంస్థలను దుర్వినియోగ పరుస్తున్న తీరుపై రాజకీయ పార్టీలో ఆందోళన చెందుతున్నాయి. జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్‌ను కేసుల్లో ఇరికించినా ఆయన మళ్లీ అధికారం చేపట్టగలిగారు. బిజెపి నిరంకుశ పోకడలకు వ్యతిరేకంగా గట్టిగా పోరాడుతున్నందునే ఇడిని ఉపయోగించి కేసులు పెడుతున్నారని ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ ఎప్పటినుంచో ఆరోపిస్తోంది. దేశ రాజధాని ఢిల్లీలోనూ ఇదే స్థితి. ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి, ఆప్ అధ్యక్షుడు కేజ్రీవాల్‌తో పాటు ఆ పార్టీకి చెందిన పలువురు నాయకులు ఇడి బాధితులుగా మారడానికి కారకులెవరో అందరికీ తెలిసిందే. ఇలా చెప్పుకుంటూ పోతే బిజెపి దుర్నీతికి, దుర్వినియోగానికి ఉదాహరణాలెన్నో! 2014వ సంవత్సరంలో నరేంద్రమోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటినుండి గత ఏడాది జనవరి వరకు దేశ వ్యాప్తంగా 121 మంది రాజకీయ నేతలపై ఇడి కేసులు పెట్టి విచారణ చేపట్టింది. వీరిలో 115 మంది అంటే 95 శాతం మంది ప్రత్యర్థి రాజకీయ పార్టీలకు చెంది, బిజెపిని గట్టిగా వ్యతిరేకించే వారే కావడం గమనార్హం. ఇలా కేసులు నమోదైన వారు బిజెపిలో చేరితే వెంటనే వారిపై నమోదైన కేసులను ఎత్తివేయడం, వారిలో కొందరికి ప్రభుత్వ పదవులను సైతం కట్టబెట్టడం మోడీ సర్కారు బరితెగింపునకు మరో నిదర్శనం. మరోవైపు ఇడి కేసుల్లో నేరం రుజువై శిక్షపడినవి చాలా తక్కువ. అధికారిక లెక్కల ప్రకారం 2011 నుండి ఇడి 1600 కేసులు నమోదు చేసి, 1800 దాడులను ఇడి నిర్వహించింది. అయినా, భయపడుతున్నారంటే ఇతర దర్యాప్తు సంస్థలకు లేని ప్రత్యేక అధికారాలు ఇడి కి ఉండటమే కారణం. ముఖ్యంగా న్యాయస్థానాల అనుమతి లేకుండానే ఆస్తులు జప్తు చేసే అధికారం ఒక సారి కేసు నమోదైతే నేరం చేయలేదని రుజువు చేసుకునే బాధ్యత నిందితునిపైనే మోపడం వంటి అధికారాలను ఇ.డి కి అప్పగించారు. ప్రస్తుత పార్లమెంటులోని ప్రతిపక్ష సభ్యుల్లో దాదాపు 90 శాతం మంది ఏదో ఒక కేంద్ర దర్యాప్తు సంస్థ నిఘానీడలో ఉన్నట్లు ఇటీవల విడుదలైన ఒక నివేదిక పేర్కొంది. తీవ్ర స్థాయిలో జరుగుతున్న ఈ అధికార దుర్వినియోగాన్ని అరికట్టి, దర్యాప్తు సంస్థల నిష్పాక్షికతపై ప్రజానీకంలో తిరిగి నమ్మకం కలిగించాల్సి ఉంది. దర్యాప్తు సంస్థలకు స్వయం ప్రతిపత్తి మాత్రమే దీనికి పరిష్కారం. ఇలా చేయడం వల్ల నిజంగానే తప్పులు చేసిన వారి భరతం పట్టవచ్చు.

# గ్రామ రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేయాలి

హైదరాబాద్, పటేల్ పట్వారీ వ్యవస్థ రద్దుతో తెలంగాణలో రెవెన్యూ వ్యవస్థ పూర్తిగా దెబ్బతిన్నది. రికార్డులకు భద్రత లేకుండా పోయింది. భూముల లెక్కాపత్రం లేదు. జమాబందీ వల్ల భూములు, ప్రభుత్వ ఆస్తులకు లెక్క గట్టేవారు. సరిహద్దులు పక్కాగా ఉండేవి. కానీ అవన్నీ దెబ్బతిన్నా, వాటిని రక్షించే ప్రయత్నం చేయడం లేదు. కెసిఆర్ హయాంలో విఆర్‌వో వ్యవస్థ రద్దుతో ఉన్నది కూడా మాయం చేశారు. దీంతో తెలంగాణలో భూదోపిడీ కేసులు పెరిగాయి. ప్రభుత్వ, దేవాదాయ, అసైన్డ్ భూములు మాయమయ్యాయి. దీనికి సమాధానం చెప్పకుండా ధరణి పేరుతో మరింతగా దోపిడీ చేశారు. ఈ క్రమంలో మళ్లీ గ్రామీణ రెవెన్యూ వ్యవస్థకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం శ్రీకారం చుట్టబోవడం ఆహ్వానించదగ్గ పరిణామం. తెలంగాణ ప్రభుత్వం ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో ధరణిని రద్దు చేస్తూ భూ భారతి చట్టం తీసుకొచ్చారు. ఈ చట్టంలో భాగంగా వీఆర్వో, వీఆర్ఏ వ్యవస్థను తీసుకురావాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రెవెన్యూ శాఖలో సంస్కరణల పేరిట వీఆర్ఏ, వీఆర్వో లాంటి కీలక వ్యవస్థను రద్దు చేసింది. వాటి స్థానంలో ధరణి పోర్టల్ తీసుకొచ్చి భూములకు సంబంధించిన అనుమతులు మంజూరు చేసి రిజిస్ట్రేషన్లు కొనసాగించారు. ఆ సమయంలో వీఆర్వోలు, వీఆర్ఏ లను ఇతర శాఖలకే కేటాయించారు. ఆ సమాచారాన్ని సేకరించి అర్హత ఉన్న ఉద్యోగులను తిరిగి వీఆర్ఏ, వీఆర్వోలుగా విధుల్లోకి తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. డిసెంబర్ 28 నెలలోగా అందుకు సంబంధించిన సమా చారాన్ని సేకరించి పెట్టాలని తెలంగాణ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ చీఫ్ కమిషనర్ నవీన్ మిట్టల్ సోమవారం నాడు ఉత్తర్వులు జారీ చేశారు. తెలంగాణలో మొత్తం 10,911 వరకు రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రతి గ్రామానికి ఒక రెవెన్యూ అధికారిని నియమించాలని నిర్ణయం తీసుకుంది. గతంలో ఉన్న వీఆర్ఏ, వీఆర్వోలను ఇతర శాఖల్లోకి బదిలీ చేశారు. వారిని తిరిగి రెవెన్యూ శాఖలోకి తీసుకువచ్చేందుకు కసరత్తు మొదలైంది. వారికి తిరిగి వీఆర్ఏ, వీఆర్వోలుగా పోస్టింగ్ ఇచ్చే అవకాశం ఉంది. లేకపోతే రెవెన్యూ శాఖలో కాంగ్రెస్ ప్రభుత్వం వేరే ఏదైనా కొత్త పేరుతో వారికి తిరిగి రెవెన్యూ అధికారులుగా పోస్టింగ్ ఇవ్వనున్నారు. ఈ మేరకు భూపరిపాలన ప్రధాన కమిషనర్ నవీన్




మిట్టల్ కలెక్టర్లకు ఉత్తర్వులు జారీ చేశారు. డిగ్రీ అర్హత ఉన్న మాజీ వీఆర్ఏ, వీఆర్వోలను రెవెన్యూ శాఖలో గతంలో నిర్వహించిన విధులు అప్పగించనున్నారు. రెవెన్యూ శాఖకు సంబంధించి తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో వీఆర్వో వ్యవస్థను పునరుద్ధించాలని కాంగ్రెస్ ప్రభుత్వం భావిస్తోంది. ప్రతి రెవెన్యూ గ్రామానికి ఒక వీఆర్వో అధికారిని నియమించడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దాంతో పాత ఉద్యోగులను మళ్లీ విధుల్లోకి తీసుకునే దిశగా అడుగులు పడుతున్నాయి. ఈ నెల 28 వరకు వీఆర్వోలు, వీఆర్ఏల పునరుద్ధరణకు గడువు విధిస్తూ తెలంగాణ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ చీఫ్ కమిషనర్ నవీన్ మిట్టల్ ఉత్తర్వులు జారీ చేశారు. వీఆర్వో, వీఆర్ఏలను తిరిగి అదే పోస్టుల్లోకి తీసుకోవడంతో పాటు రెవెన్యూ శాఖలో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి తెలంగాణ ప్రభుత్వం త్వరలోనే నోటిఫికేషన్ జారీ చేయనుంది. జూనియర్ రెవెన్యూ అధికారి పేరుతో ప్రతి గ్రామంలో విలేజ్ రెవెన్యూ ఆఫీసర్ అందుబాటులో ఉండేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. తద్వారా భూమి సమస్యల పరిష్కారం అవుతాయని అధికారులు చెబుతున్నారు. ధరణి కారణంగా వేలాది మంది భూములు కోల్పోయారని, అందులో జరిగిన తప్పిదాలను గుర్తించి సమస్య పరిష్కరిస్తామని సీఎం రేవంత్ రెడ్డి పలుమార్లు ప్రస్తావించారు.

# కేడర్‌ను కాపాడుకునే యత్నం...



అమరావతి,ఆంధ్రప్రదేశ్‌లో ఆరు నెలల క్రితం జరిగిన ఎన్నికల్లో వైఎస్ఆర్‌సీపీ ఘోరంగా పరాజయం పాలయ్యాక ఇప్పుడు మళ్లీ తమదే అధికారం అంటూ..ఆ పార్టీ నేతలు బల్లగుద్ది చెబుతున్నారు. పార్టీ అధినేత కూడా కూటమి ప్రభుత్వానికి కాలంచెల్లిందని విమర్శలుచేస్తున్నారు. ఆరునెలల్లోనే ప్రభుత్వం అప్రతిష్టను మూటకట్టుకుందని, అన్నిరంగాల్లోనూ విఫలంఅయ్యిందని విమర్శలుచేస్తోంది. జనవరి నుంచి నియోజకవర్గాల బాట పట్టాలని వైసీపీ అధినేత జగన్ నిర్ణయించుకున్నారు. దీనికి తగ్గట్టుగానే కేడర్, లీడర్‌లను సమాయత్తం చేసేందుకు అదిగో ఎన్నికలు అన్నట్టు ప్రచారం చేస్తోంది. జమిలి ఎన్నికల బిల్లు పార్లమెంట్‌లో ఉంది. దీనిపై జేపీసీ స్టడీ చేస్తోంది. అది వచ్చే పార్లమెంట్ సమావేశాలకు ఆమోదం పొందుతుంది. అది అమోదం పొంది అమల్లోకి వస్తే మాత్రం 2027లోనే ఎన్నికలు వస్తాయని వైసీపీ చెబుతోంది. అధినేత నుంచి గల్లీ లీడర్ వరకు అంతా అదే ప్రచారం చేస్తున్నారు. దీనికి చాలా కారణాలు ఉన్నాయి. 2024 ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన షాక్ నుంచి ఇంకా చాలా మంది వైసీపీ నేతలు తేరుకోలేక పోతున్నారు. అలాంటి తీర్పు ఎలా ఇచ్చారనే మధనపడుతున్నారు. మరికొందరు కూటమి పార్టీల్లో ఏదో పార్టీలో చేరిపోవాలనే ఆలోచన చేస్తున్నారు. ఇప్పటికే చాలా మంది ఆ పని చేశారు కూడా. కొన్ని నియోజకవర్గాల్లో ఇన్చార్జ్‌లు లేకపోవడంతో ఎవరితో నడవాలో తెలియని పరిస్థితిలో కేడర్ ఉంది. ఇలాంటి స్థితిని హ్యాండిల్ చేయలేకుంటే పార్టీకి భారీగా డ్యామేజ్ తప్పదని గ్రహించిన వైసీపీ ఇదిగో ఎన్నికలు అంటూ ప్రచారం చేస్తోంది. ఒక వేళ 2027లో ఎన్నికలు జరిగితే ఇంకా మూడేళ్లే నాలుగేళ్లే ఉందని నేతలంతా జనంలో ఉంటారని వైసీపీ ఎలాన్. కేడర్‌లో కూడా ఉత్సాహం ఉంటుందని అభిప్రాయపడుతున్నారు. 2019 అసెంబ్లీ ఎన్నికల్లో 151 అసెంబ్లీ స్థానాలతో దేశ చరిత్రలోనే అతి పెద్ద విజయాన్ని అందుకున్న ఆ పార్టీ ఐదేళ్లు తిరిగే సరికి 11 స్థానాలకు పరిమితం అయింది. ఈ షాక్‌లో ఉన్న కేడర్‌ను, పక్క పార్టీల వైపు చూస్తున్న లీడర్‌ను తమతో ఉంచుకునేందుకు ఎన్నికల పాట అందుకుంది. జమిలీ ఎన్నికలు 2027లోనే వస్తాయని అప్పటి కూటమిపై వ్యతిరేకత తీవ్ర స్థాయిలో ఉంటుందని నూరి పోస్తోంది. దీన్నే జనంలోకి తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తోంది. కూటమి ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌లో పగ్గాలు చేపట్టి ఆరు నెలలు అవుతోంది. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను క్రమంగా అమలు చేస్తూ వస్తోంది. మరోవైపు పారిశ్రామికవేత్తలను రాష్ట్రంవైపు తిప్పుకునేందుకు పాట్లు పడుతోంది. అమరావతిని పట్టాలు ఎక్కిస్తోంది. హామీల అమలు విషయంలో మాత్రం కాస్త తడబాటు ఉంది. దీన్నే వైసీపీ తమకు అనుకూలంగా మార్చుకుంటోంది . ప్రజల్లో వ్యతిరేకత మరింతగా పెంచేందుకు ప్రయత్నాలు చేస్తోంది. ఈ మధ్య కాలంలోనే రైతులకు సంబంధించిన ధాన్యం కొనుగోలు సరిగా జరగడం లేదని ధర్నాలు చేపట్టింది. విద్యుత్ ఛార్జీలపై కూడా నిరసనలు చేసేందుకు సిద్ధమైంది. ఇలా వివిధ సమస్యలు ప్రజల్లోకి తీసుకెళ్తూనే... గత ప్రభుత్వ హయాంలో ఇచ్చిన నగదు బదిలీ పథకాలను గుర్తు చేస్తోంది. ఇప్పుడు వాటిని కూటమి ప్రభుత్వం ఆపేసిందన్న ప్రచారానికి తెరతీసింది. అందుకే అప్పట్లో జగన్ ఉండి ఉంటే అనే ప్రచారం తీసుకొచ్చింది. అది పెద్దగా వర్కౌట్ కాలేదు. నియోజకవర్గాల పునర్విభజన కంటే ముందే ఎన్నికలు వస్తాయని ప్రచారం చేస్తే పార్టీ మారే వారి ఆలోచన కూడా మార్చవచ్చని చెబుతున్నారు. కూటమి హౌస్‌ఫుల్ అయినందున వైసీపీ నుంచి దూకేందుకు సిద్ధంగా ఉన్న వాళ్లు తగ్గుతారని ఎ÷–లాన్. ఇలా నలువైపులా ఆలోచించిన వైసీపీ 2027లోనే ఎన్నికలు రాబోతున్నాయని కచ్చితంగా వైసీపీ అధికారంలోకి వస్తుందని ప్రచారం చేస్తోంది. ఇప్పటి వరకు ఈ ప్రచారం ఎంపీలు, కింది స్థాయి నాయకులు మాత్రమే చేస్తూ వచ్చారు. ఇప్పుడు ఏకంగా అధ్యక్షుడు జగన్ అందుకున్నారు. పులివెందులలో పర్యటించిన జగన్ 2027లో ఎన్నికలు వస్తాయని వైసీపీ అధికారంలోకి వస్తుందని అన్నారు. అమలు చేయలేదని హామీలు ఇచ్చిన ఇప్పుడు ప్రజల వ్యతిరేకత ఎదుర్కొంటున్న చంద్రబాబు సర్కారుకి గుణపాఠం తప్పదని హెచ్చరించారు. పులివెందుల పర్యటనలో భాగంగా ఆయన కడప నేతలు, కార్పొరేటర్లు, కీలక నేతలతో సమావేశమయ్యారు. జిల్లా, రాష్ట్ర రాజకీయాలు, పార్టీ బలోపేతంపై చర్చించారు. కష్టాలు శాశ్వతం కావని.. పార్టీని అంటిపెట్టుకున్న వాళ్లకు భవిష్యత్‌లో గుర్తింపు ఉంటుందని జగన్ అన్నారు. ఇలాంటి టైంలో వ్యక్తిత్వాన్ని అమ్ముకోకూడదని నేతలకు సూచించారు. దేశ చరిత్రలోనే ఎవరూ చేయని విధంగా సంక్షేమ కార్యక్రమాలు చేశామని అన్నారు. కేవలం అబద్దాలు చెప్పలేకపోవడంతోనే ప్రతిపక్షంలో కూర్చున్నా మన్నారు జగన్. ప్రజలు వాస్తవాలు తెలుసుకుంటారని గత ప్రభుత్వంతో ఈ ప్రభుత్వం పని తీరును పోల్చి చూస్తారని అన్నారు. 2027లో జరిగే ఎన్నికల్లో కచ్చితంగా వైసీపీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేస్తున్నారు.

# హిమాచల్,కాశ్మీర్‌లపై మందుదుప్పటి

న్యూఢిల్లీ, హిమాచల్‌ప్రదేశ్, జమ్ముకాశ్మీర్, ఉత్తరాఖండ్‌లపై దట్టమైన మంచు దుప్పటి పరుచుకుంది. దట్టమైన మంచుతో పలు జాతీయ రహదారులను మూసివేసినట్లు అధికారులు ప్రకటించారు. హిమాచల్‌ప్రదేశ్‌లో మూడు జాతీయ రహదారులతో పాటు సుమారు 266 రహదారులు మూసివేయబడ్డాయి. మూసివేసిన 266 రహదారుల్లో సిమ్లాలో 123, లాహౌల్‌లో 36, స్పితి, కులులో 25 ఉన్నాయి. 173 ట్రాన్స్‌ఫార్మర్‌లకు అంతరాయం ఏర్పడిందని, దీంతో రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ సరఫరాపై తీవ్ర ప్రభావం పడిందని తెలిపింది. హిమాచల్‌ప్రదేశ్‌లో తీవ్రమైన చలి పరిస్థితుల కారణంగా భారత వాతావరణ విభాగం (ఐఎండి) 'ఆరెంజ్' అలర్ట్ జారీ చేసింది. దట్టమైన పొగమంచు ఉండే అవకాశం ఉందని, కొన్ని ప్రాంతాల్లో వారాంతంలో వర్షం, మంచు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది.ఉత్తరాఖండ్‌లోని డెహ్రాడూన్‌లో భారీ హిమపాతం కురిసింది. త్యుని–చక్రతా–ముస్సోరి జాతీయ రహదారిపై 30 కి.మీ మేర ట్రాఫిక్ నిలిచిపోయింది. రాష్ట్రంలోని ధరణాధర్–కోటి కనసర్ రహదారిపై భారీ మంచుతో ఢిల్లీ నుండి వచ్చిన ఇద్దరు పర్యాటకులు చిక్కుకుపోయారని స్థానిక మీడియా తెలిపింది. ఉత్తర భారతదేశంలోని అనేక ప్రాంతాల్లోనూ దట్టమైన మంచు కమ్మేసింది. జమ్ముకాశ్మీర్‌లోని శ్రీనగర్‌లో కనిష్ట ఉష్ణోగ్రత మైనస్ 7 డిగ్రీల సెల్సియస్‌కు పడిపోయింది. ఇకపోతే చలి తీవ్రతతో ఉత్తర భారతం గజగజలాడుతోంది. ఉష్ణోగ్రతలు దారుణంగా పడిపోతున్నాయి. కశ్మీర్‌లోని పలు ప్రదేశాలు చలికి అల్లాడిపోతున్నాయి. జలాశయాలు గడ్డకట్టుకుపోయాయి. నీటి సరఫరా గొట్టాల్లో నీరు గడ్డకట్టేస్తోంది. శ్రీనగర్‌లో మైనస్ 7.3 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. రాబోయే రెండ్రోజుల్లో ఇది మరో 2–3 డిగ్రీల వరకు తగ్గిపోతుందని వాతావరణ విభాగం అంచనా వేసింది.



కశ్మీర్‌లో అత్యంత చల్లగా ఉండే 40 రోజుల కాలం ఈ నెల 21న ప్రారంభమైంది. అప్పటి నుంచి కనిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే తక్కువగా ఉంటున్నాయి. అమర్‌నాథ్ యాత్రకు బేస్‌క్యాంపు అయిన పహాల్గామ్‌లో మైనస్ 8.4 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత ఉంది. రాజస్థాన్‌లోని అనేక ప్రాంతాలను దట్టమైన పొగమంచు కమ్మేస్తోంది. పశ్చిమ రాజస్థాన్‌లోని పలు ప్రాంతాలకు అత్యంత చల్లని రోజుగా బుధవారం నిలిచిపోయింది. పంజాబ్, హరియాణాల్లోనూ శీతల గాలులు ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. దిల్లీని పొగమంచు కప్పేసింది. దిల్లీ–ఎన్‌సీఆర్ ప్రాంతాల్లో బుధవారం తెల్లవారుజామున 9.6 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మంచు దట్టంగా కురుస్తూ.. 100 మీటర్ల దూరంలో ఉన్న వాహనాలు కూడా కన్పించని పరిస్థితి నెలకొంది. దీంతో పలు విమానాలు, రైళ్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం వాటిల్లింది. వాయు నాణ్యతా సూచీ (ఏక్యూఐ) 334గా నమోదైంది.

# మన్మోహన్ సింగ్ హయాంలో చారిత్రక నిర్ణయాలు



న్యూఢిల్లీ,మాజీ ప్రధాని, ప్రముఖ ఆర్థికవేత్త మన్మోహన్ సింగ్ భారత ఆర్థిక విధానాలపై చెరగని ముద్ర వేశారు. ఆర్థిక సంక్షోభం నుంచి భారత్‌ను గట్టెక్కించడమే కాకుండా, ప్రపంచంలో వేగంగా వృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా దేశాన్ని నిలిపారు. ప్రధానిగా పదేళ్లు సేవలందించిన ఆయన దేశ చరిత్రలో ఎన్నో కఠినమైన నిర్ణయాలు తీసుకున్నారు. దేశాభివృద్ధిలో తనదైన ముద్ర వేశారు. దేశానికి సరికొత్త దశ, దిశ చూపిన ప్రధానిగా చరిత్రలో నిలిచిపోయారు.2004 నుంచి 2014 వరకు భారత ప్రధానిగా సేవలందించిన మన్మోహన్ సింగ్ మొదటి పర్యాయంలోనే దేశంలో ఎన్నో సంస్కరణలను తీసుకొచ్చారు. ప్రభుత్వానికి సంబంధించిన ప్రతి సమాచారాన్ని తెలుసుకునే హక్కు సామాన్యులకు ఉండాలనే లక్ష్యంతో సమాచార హక్కు చట్టాన్ని తెచ్చారు. గ్రామీణ ప్రజలకు వ్యవసాయేతర ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో చారిత్రక ఉపాధి హామీ పథకానికి శ్రీకారం చుట్టారు. ప్రతి పౌరుడికి ఒక విశిష్ఠ గుర్తింపు సంఖ్య ఉండాలని ఆధార్ వ్యవస్థను తీసుకొచ్చారు. గ్రామీణ ప్రజల ఆరోగ్యం కోసం నేషనల్ రూరల్ హెల్త్ మిషన్ చేపట్టారు. మన్మోహన్ సింగ్ పాలనాకాలంలోనే దేశంలో 3జీ, 4జీ సేవల ప్రారంభంతో మొబైల్ సాంకేతిక విప్లవం ఊపందుకుంది. ప్రైవేటు పాఠశాలల్లోనూ కొందరు పేద విద్యార్థులకు ఉచితంగా చదువుకునేలా నిబంధనలు రూపొందించింది. సామాన్యుడి చేతికి పాశుపత్రాస్త్రంలాంటి సమాచార హక్కును అందించింది. దేశంలో 3 కోట్ల మంది చిన్న, సన్నకారు రైతులకు రూ.72 వేల కోట్ల రుణమాఫీ చేసిన ఘనత మన్మోహన్ ప్రభుత్వానికే దక్కుతుంది. మన్మోహన్ ప్రభుత్వంలో దేశంలో జరిగిన మార్పులను గుర్తించిన ప్రజలు 2009లో మరోసారి యూపీఏ ప్రభుత్వానికి అవకాశం ఇచ్చారు. 2009 మే 22న మన్మోహన్ సింగ్ రెండోసారి ప్రధానిగా బాధ్యతలు చేపట్టారు. పైకి మృదుస్వభావిలా కనిపించినా దేశం కోసం తీసుకునే నిర్ణయాల్లో అత్యంత కఠినంగా వ్యవహరించారు. ప్రత్యేక రాష్ట్రంగా తెలంగాణ ఏర్పాటు, ఉపాధి హామీ పథకం ప్రారంభం వంటి ఎన్నో కీలక పరిణామాలు ఆయన ప్రధానిగా ఉన్నప్పుడే చోటుచేసుకున్నాయి. 2008లో చారిత్రాత్మకమైన భారతదేశం–అమెరికా పౌర అణు ఒప్పందంపై సంతకం చేశారు. భారతదేశం ప్రపంచ అణు మార్కెట్లోకి ప్రవేశించడానికి, ఇంధన సంక్షోభాన్ని అధిగమించడానికి ఈ ఒప్పందం దోహదపడింది. యూపీఏ ప్రభుత్వానికి బయటి నుంచి మద్దతిచ్చిన లెఫ్ట్ పార్టీలు ఈ ఒప్పందాన్ని తీవ్రంగా వ్యతిరేకించాయి.

# పంచాయితీ ఎన్నికల హడావిడి..రిజర్వేషన్లపై అభ్యర్థుల్లో గుబులు

నిజామాబాద్,గ్రామ పంచాయతీ ఎన్నికల ఏర్పాట్లపై అధికార యంత్రాంగం దృష్టిసారించింది. మరోవైపు పంచాయతీ రిజర్వేషన్లు స్థానిక పార్టీ నేతలను టెన్షన్ పెడుతున్నాయి. ఈ ఏడాది ఫిబ్రవరితో సర్పంచ్ పదవీ కాలం ముగియగా అప్పటి నుంచి పల్లెల్లో స్పెషల్ ఆఫీసర్ల పాలన నడుస్తున్న సంగతి తెలిసిందే. ఎన్నికల కమిషన్ ఆదేశాలతో యంత్రాంగంతో పనులు చేయిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం కూడా పంచాయతీ ఎన్నికలకు రెడీ అయింది.

బీసీ రిజర్వేషన్ పెంచడానికి కులగణన చేపట్టి బీసీ కమిషన్, డెడికేటెడ్ కమిషన్ను అపాయింట్ చేసింది. ప్రతి పనీ పార్టీలకు తెలిసేలా పారదర్శకంగా చేస్తున్నారు. నోటిఫికేషన్ వచ్చే టైంకు అన్నీ సిద్ధం చేసుకునేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ క్రమంలో ఇసి అందుతున్న ఆదేశాలను ఎప్పటికప్పుడు గ్రౌండ్‌లో అమలు చేస్తూ రిపోర్టు పంపుతున్నారు. రిజర్వేషన్‌లు ఎలా ఉంటాయోనని రాజకీయ పార్టీల్లో చర్చ జరుగుతోంది. పంచాయతీ సర్పంచ్, వార్డు మెంబర్ ఎన్నికలు పేపర్ బ్యాలెట్ ద్వారా నిర్వహిస్తారు. బ్యాలెట్ పూపర్ పై సింబల్స్ మాత్రమే ఉంటాయి. వాటిపై పోటీ చేసే అభ్యర్థుల పేర్లు ఉండవు. ఎన్నికల ప్రచారంలో అభ్యర్థులే తమకు కేటాయించిన గుర్తులు ప్రచారం చేసుకుంటారు. నిబంధనలను అనుసరించి ఇప్పుడు మొత్తం 30 గుర్తులతో బ్యాలెట్‌లు రూపొందనున్నాయి. గత ఎలక్షన్‌లో బ్యాలెట్‌పేపర్ల కోసం ఉపయోగించిన బాక్స్‌ల రిపేర్లకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. జడ్పీ ఆఫీస్‌లో భద్రపర్చిన పోలింగ్‌బాక్స్




ల్లో అదనంగా ఉన్నవాటిని వారం కింద పొరుగు జిల్లాలకు తరలించారు. పెంచిన15 గ్రామ పంచాయతీలు కలిపి జిల్లాలో మొత్తం 545 పంచాయతీలు, 5,022 వార్డుల్లో ఎన్నికలు జరుగుతాయి. ఓటర్లుగా 8,30,580 తేలారు. వారిలో పురుషులు 3,87,017, మహిళలు 4,43,548, ఉన్నారు. ప్రతి 600 మందికి ఒక పోలింగ్ సెంటర్ చొప్పున మొత్తం 5,053 సెంటర్లను ప్రకటించారు. ఆ లిస్టును ఎంపీడీవో, గ్రామ పంచాయతీ ఆఫీసుల్లో అంటించారు. ఎంపిక చేసిన పోలింగ్ కేంద్రాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి సౌకర్యాలు కల్పిస్తారు.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com